ప్రజాశక్తి
సోపతి
నవంబర్ 19, 2014 ఆదివారం అనుబంధం



సాంప్రదాయ చదువుల సరిహద్దులు దాటేద్దాం

స్ఫూర్తిదాయక చరితలు















తెలంగాణ విజ్ఞాన భాండాగారాలు

జీవితాన్నే చదివాను

నాలుగేళ్ళ వయసులోనే బాలనటిగా సినిమా పరిశ్రమలో కాలుపెట్టిన సారికా ఠాగూర్ సారికగా మనందరికీ సుపరిచితురాలు. కమల్ హాసన్‌ను పెళ్ళి చేసుకున్న తర్వాత సినిమా పరిశ్రమను వదిలేసిన సారిక, భర్తే లోకంగా బతికింది. కాని 2002లో కమల్ నుంచి విడిపోయిన తర్వాత మళ్ళీ తన శక్తి సామర్థ్యాలను పుంజుకొని పరిశ్రమలో తనేంటో నిరూపించుకోవడానికి ముంబయికి చేరింది. జీవితంలో చిన్నప్పటి నుంచి ఎన్నో ఒడిదుడుకులను చవిచూసిన సారిక గురించి సోపతి పాఠకుల కోసం...

అందరి హీరోయిన్‌లా కాకుండా సాదాసీదాగా ఉండే సారిక జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు. యుక్త వయసులోనే తల్లిదండ్రులు విడిపోయారు. ఇంటి అవసరాల కోసం నాలుగేళ్ళ వయసులోనే సినిమా ప్రపంచంలోకి అడుగుపెట్టింది సారిక. సినిమాలతోనే సమయం సరిపోవడం వల్ల స్కూలుకు పోయి చదువుకుంది లేదు. సినిమా పరిశ్రమనే పాఠశాలగా జీవితాన్ని చదివింది. 21ఏళ్ళ వయసప్పుడు అమ్మ దగ్గర నుంచి దూరంగా వచ్చేసింది. చేతిలో డబ్బులు, బట్టలు ఏమీ లేవు. కారులోనే ఆరు రోజులు గడిపింది.

వైవాహిక జీవితం: 28ఏళ్ళ వయసులో కమల్ హాసన్‌ను వివాహం చేసుకున్న సారిక, కమల్ సినిమాలకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా మారింది. కమల్ 'హే రామ్' సినిమాకి జాతీయ బెస్ట్ కాస్ట్యూమ్ డిజైనర్ అవార్డును అందుకుంది. 2002లో అంటే 43ఏళ్ళ వయసులో ఇద్దరు కుమార్తెలు శృతి, అక్షరలతో మెట్టినింటిని వదిలి ముంబయికి చేరుకుని మళ్ళీ నటన జీవితాన్ని ప్రారంభించింది.

నటననే ఎంచుకోవడానికి కారణం : చెన్నై నుంచి ముంబయికి చేరుకున్న సారిక నటించాలనే అనుకున్నారు. కాస్ట్యూమ్ డిజైనర్‌గా, డబ్బింగ్ ఆర్టిస్టుగా అనేక రంగాల్లోనే అనుభవం ఉన్నా నటించడం చాలా తేలిక అని చెబుతారామె. ఇంకా ఏమంటున్నారంటే "నాకు ఎలాంటి బిజినెస్‌లు, బ్యాంకు ఖాతాలు లేవు. డబ్బుల అవసరం ఎంతో ఉంది కాబట్టి నటించానుకున్నాను. నటికి ఇచ్చే రెమ్యునరేషన్ ఎక్కువగా ఉంటుంది కూడా. అయినా ఆరునెలల వరకు ఎలాంటి అవకాశాలూ రాలేదు. వచ్చినవి కూడా మంచి రోల్స్ కావు. ఏదో చేయాలనే తపన ఉంది. ఊహించని విధంగా నా కెరీర్ ఉండాలని కోరుకుంటున్నాను".

జీవితంలో ఒడిదుడుకుల గురించి... : సారిక జీవితంలో రెండు ముఖ్యమైన సంఘటనల గురించి ఆమె మాటల్లోనే... "ఈ రెండు సంఘటనలకు చాలా తేడా ఉంది. అప్పుడు నేను ఒంటరిని. కాని ఇప్పుడు ఇద్దరు పిల్లల తల్లిని. అంతేకాదు, ఇప్పుడు ఆరు రోజులు కారులో జీవించలేదు కూడా(నవ్వుతూ). కాని ఈ రెంటికి ఉన్న సారూప్యత ఏమిటంటే మళ్ళీ కొత్తగా జీవితాన్ని ప్రారంభించడం. ఇద్దరు పిల్లల అలనా పాలనా చూసుకునే ఒంటరి తల్లిగా ఇప్పుడు ఉన్నాను. ప్రతి ఒక్కరి జీవితంలో ఇలాంటి ఒడిదుడుకులు వస్తాయి. అవి వారిలోని సొంత బలాలను, శక్తులను బయటికి తీసి మనిషిని గట్టిపరుస్తాయి. అదే నా జీవితంలోనూ జరిగింది" అని సారిక చెబుతున్నారు.

ఒంటరి తల్లిగా... : "నా తల్లిదండ్రుల లాగే నేనూ నాభర్త నుండి విడిపోయాను. కాని అందరి జీవితాలు ఒకేలా ఉండవు కదా. జీవితంలో అంతా చెడే జరుగుతుందని ఎందుకనుకోవాలి. మంచి కూడా జరుగుతుందని అనుకోవచ్చు కదా. ఆదే పిల్లలకు చెబుతుంటాను. వారు కూడా వారికి ఇష్టమైన రంగాన్నే ఎంచుకున్నారు. ఇప్పుడు వారిద్దరూ కూడా సినిమా రంగంలో స్థిరపడ్డారు. ఇక పిల్లల పట్ల నా బాధ్యత నెరవేరిందనే అనుకుంటున్నాను".

సొంత వ్యక్తిత్వం, భావాలు గల మహిళగా... : ఒకరి జీవితంలో బాధాకర సంఘటనలు జరిగినప్పుడు వాటి గురించి గుచ్చిగుచ్చి అడగటం, అవమానించడం చేస్తుంటారు. అది మానవ నైజం కూడా. అందుకే నేను నా తల్లి నుండి విడిపోయినప్పుడు ఈ విషయాన్ని నా స్నేహితులకు కూడా చెప్పలేదు. నేను నా కాళ్ళ మీద నిలబడాలని కోరుకునే వ్యక్తిని. అది తప్పా, కరెక్టా అన్నది తర్వాతి విషయం. అది నా సొంత నిర్ణయం మాత్రమే.

చిన్నప్పుడే సినీరంగంలో... : నా మొదటి సినిమా హమ్‌రాజ్. నేను ఎక్కువగా అబ్బాయిగానే నటించాను. అప్పుడు నన్ను అందరూ మాస్టర్ సూరజ్ అని పిలిచేవారు. చిన్నపిల్లలుగా ఉన్నప్పుడు ఇష్టంతో ఏపనీ చేయరు. ఎందుకంటే అదేమిటో వారికి తెలియదు కాబట్టి. వారి పని వారు చేసుకొని ఇంటికి పోవడం తప్ప ఇంకేమీ తెలియదు.

మేకప్ లేకుండానే నటించేవారు : నాకు మేకప్ లేకుండా నటించడమంటేనే ఎక్కువ ఇష్టం. మేకప్ అంటే లిప్‌స్టిక్ ఒక్కటే. అదే సినిమాలలో అయితే లిప్‌స్టిక్‌తో పాటు ఐ లైనర్. సినిమాల్లో బాధాకర సన్నివేశాల్లో నటించేటప్పుడు మాత్రం మేకప్ లేకుంటేనే సన్నివేశాలు సహజంగా వస్తాయని దర్శకుడికి చెప్పేదాన్ని. వారు సరే అనేవారు. అందుకే పాత సినిమాల్లో మేకప్ అస్సలు ఉండదు. ఇప్పుడు కూడా మేకప్ లేకుండానే నటిస్తానని చెబుతున్నాను. కాని నాకు పొగరు, ఎదురుచెబుతానని అనుకుంటారు చాలా మంది.

టాలీవుడ్‌లో కూడా నటించాలని ఉంది : కమల్ నుంచి విడిపోయిన తర్వాత సినిమాల మీద దృష్టి పెట్టిన సారిక అనేక సినిమాలలో నటించింది. వాటిలో చెప్పుదగ్గవి గోద్రా సంఘటనల ఆధారంగా తీసిన పర్జానియా. ఈ సినిమాలో నటనకు గాను జాతీయ ఉత్తమ నటి అవార్డును అందుకుంది. అంతేకాదు, అమితాబ్ భార్యగా బుల్లితెరపై యుధ్ సీరియల్‌లో కూడా నటిస్తుంది. విక్రమ్ హీరోగా హిందీ, తమిళంలో తీసిన డేవిడ్ సినిమాలో ఐటమ్ సాంగ్ చేసి అందరినీ అశ్చర్యానికి గురిచేసింది కూడా.

సారిక పెద్ద కూతురు శృతి తెలుగు సినిమాల్లో బిజీ హీరోయిన్‌గా మారింది. అంతేకాదు, తెలుగు సినిమాలో తల్లి, వదిన, అత్త పాత్రలకు ప్రాధాన్యత పెరిగింది. వాటిల్లో అవకాశాలు కోసం కూడా సారిక ఎదురు చూస్తోంది. శృతి కూడా తన తల్లికి ఖాళీ సమయం లేకుండా నటింప చేయడానికే ఎక్కువ ప్రోత్సహిస్తూ సహాయ సహకారాలను అందిస్తోంది.

- నక్షత్ర

■ అంతరంగం

ధీరగుణం

లోకంలో మనుషులు మూడు రకాలుగా ఉంటారన్నది ఒక నానుడి. సాధారణంగా నీచులు, మధ్యములు, ధీరులు అని వర్గీకరిస్తారు. వీరిలో నీచులు ఒక పని మొదలెడితే ఎలాంటి అడ్డంకులు వస్తాయోనని భయంతో అసలు పనినే మొదలుపెట్టరు. ఇక మధ్యములు ధైర్యం చేసి ఒక పనిని ఎలాగో ప్రారంభిస్తారు. కానీ మధ్యలో విఘ్నాలు రాగానే వాటికి భయపడి వదిలివేస్తారు. ధీరులు మాత్రం అలా కాదు. ఒక పని చేపట్టి మొదలుపెట్టాక ఎన్ని అవాంతరాలు వచ్చినా 'ప్రజ్ఞానిధులు' కనుక వదిలిపెట్టరు. ఆ పని తుదిదశకు చేరేవరకు కొనసాగిస్తారు. మధ్యలో వదిలేయకుండా పట్టుదలతో వ్యవహరిస్తారు. ఇదే ధీరగుణం. ప్రతి మనిషికి ఉండాల్సిన సుగుణం. అడ్డంకులు వచ్చినా, వాటిని అధిగమించడం ఎలానో యోచించాలే తప్ప, పారిపోవడం, మధ్యలోనే వదిలేయడం పరిష్కారం కాదు.

ఈ కార్యశీలత్వం ధీరుల లక్షణం. ఎలాగయినా ఒక కార్యాన్ని సాధించితీరాలన్న పట్టుదల కలిగిన ధీరుడు కార్యసాధనలో సుఖాన్ని గానీ, దు:ఖాన్నీ గానీ లెక్కించడు. ఒకచోట కటిక నేలమీద పడుకోవలసి వచ్చినా చింతించడు. మరొకచోట హంసతూలికా తల్పం మీద పడుకునే అవకాశం కలిగినా పొంగిపోడు. నమ్ముకున్న మార్గాన ప్రయాణిస్తారు. న్యాయమార్గంలోనే పనుల్ని సాధించాలనుకుంటారు. తిమ్మిని బమ్మిని చేసి నెగ్గుకురావడం కాదు, నేరుగా, ధైర్యంగా వ్యవహరించడం ద్వారా లక్ష్యాన్ని చేరుకోవడమే ధీరుల లక్షణం. ఈ క్రమాన నిందల్ని లెక్కించరు. పొగడ్తలకు ఉబ్బిపోరు. త్రికరణశుద్ధిగా మనసును లగ్నం చేసి తమ పనిలో లీనమవుతారు. తమ నిర్ణయాలకు తాము బాధ్యత వహించి వ్యవహరించే స్వభావం ఈ కోవకు చెందిన వారి ప్రత్యేకగుణం.

కోపావేశాలకు, భావోద్వేగాలకు లోనయి తొందరపడి వ్యవహరిస్తే ఎలాంటి ఫలితాలు వుంటాయో ధీరులకు తెలుసు. కనుక ఎంచుకున్న మార్గాన, నిర్దేశించుకున్న దిశలో ప్రయాణిస్తారు. ప్రలోభాలకు లొంగరు. ఇతరేతర ఆశలు చూపేవారి మాటలకు పొంగిపోరు. ధైర్యాన్ని సడలింపజేసేవారి మాటల యెడల అప్రమత్తంగా ఉంటారు. అనుకోని కష్టాలు, దు:ఖాలు వచ్చినా కుంగిపోరు. ధైర్యగుణాన్ని పోగొట్టుకోకుండా స్థితప్రజ్ఞతతో వ్యవహరిస్తారు. అగ్నిని ఎంతగా ఎగదోసి తలకిందులు చేసినప్పటికీ దాని జ్వాలలు ఆరవు. ఎందుకంటే అగ్నికి అది సహజగుణం. అలాగే ధైర్యమన్నది ధీరులకుండే సహజాతి సహజ లక్షణం. ఈ ధీరగుణమే వారిని కాపాడుతుంది. ముమ్ముందుకు తీసుకెళుతుంది. ఇతరులు వేసిన మార్గంలో కాకుండా, తనదయిన మార్గాన్ని తనకు తాను నిర్మించుకునేలా పురిగొల్పుతుంది. ఈ క్రమాన ముళ్ళు రాళ్ళు ఎదురయినా తొలగించుకుంటూ ముందుకు వెళ్ళగల మౌలిక లక్షణం ధీరుని అంతరువుల్లో ఉంటుంది. కనుక ధీరగుణం మనిషికి చెక్కుచెదరని ఆభరణం.

వెంటాడే వాక్యం

భవిష్యత్తు పట్ల మనం చూపే నిజమైన ఔదార్యమేమిటంటే వర్తమానానికి మనదగ్గరున్నదంతా ఇచ్చేయడం. - అల్బర్ట్

ప్రజాశక్తి సోపతి

నవంబర్ 9, 2014

లేఖలు 4

సంగీతం

సుస్వరాల, గానకోకిలల గీతామృతం 5

కవర్‌స్టోరీ

స్ఫూర్తిదాయక చరితలు 6

అనువాక కథ

గ్రామసీమల్లో మంత్రిగారి పాదయాత్ర 10

సృజన తెలంగాణ విజ్ఞాన భాండాగారాలు 12

స్ఫూర్తినిచ్చిన గురువు

నెమలీక 14

సీరియల్ ప్రేమ - విప్లవం 16

సంప్రదాయ చదువుల

సరిహద్దులు దాటేద్దాం 18

జోక్స్ కార్నర్ 19

సైన్స్ మొక్కలు కీటకాలనెలా ఆకర్షిస్తాయి? 20

ఎరుక ఆనందాన్నిచ్చే పరిపూర్ణ 'పని' 21

నవరాగం కల విరిగిన చప్పుడు 22

సోర్స్‌కోడ్ "అమ్మ" లాంటి యాప్ 23

సమీక్షలు

ప్రజాపోరుకు ప్రతిబింబం 24

ఈ వారం కవిత్వం

లోలోపలి విధ్వంసం 26



మనిషిని మరింత మానవీయంగా తీర్చిదిద్దేశక్తి స్ఫూర్తిదాయక జీవితగాథలకు ఉంటుంది. అలాంటి వారి ఆత్మకథల, జీవితచరిత్రల తీరుతెన్నుల విశ్లేషణే ఈ వారం ముఖచిత్ర కథనం.

లేఖలు

అందరికీ ఆచరణీయం

'పల్లెలకు ఆదర్శం' కవర్‌స్టోరీ వివరాలు బాగున్నాయి. దేశంలోనే ఆదర్శగ్రామంగా ఎన్నికై, ఎన్నో గ్రామాలకు ఆదర్శంగా నిలిచిన గంగదేవిపల్లి వివరాలు ఆసక్తిగా ఉన్నాయి. అక్కడ అవలంభించిన పద్ధతులు, ఏర్పడిన కమిటీలు అందరూ ఆచరించదగ్గవే. కమిటీలు వేసుకోవడంతో ఆగిపోకుండా, వాటిని అమలు చేసి ఆ గ్రామ ప్రజలు వారిని వారే తీర్చిదిద్దుకున్న తీరు ఎందరికో స్ఫూర్తిదాయకం. 34 ఏళ్ల క్రితమే కూసం రాజమౌళి గారు ఈ దిశగా అడుగులు వేయడం ఆశ్చర్యపరచింది. అప్పటినుండే ఊళ్లో ఉన్న ఒక్కో సమస్యను అధిగమించి గ్రామాభివృద్ధికి పాటుపడిన రాజమౌళి అభినందనీయుడు. అక్షరాస్యత, నీటి సరఫరా, వైద్యం, మద్యపాన నిషేధం, డ్రైనేజీ వ్యవస్థ, పరిశుభ్రత.. కమిటీ నిబంధనలను ఆచరించని వాళ్ల అపరాధ రుసుము చెల్లించడం... ఇలా ఒక్కో వ్యవస్థను అభివృద్ధి చేసుకున్న విధానం ప్రతి గ్రామమూ ఆచరణీయం.

– ప్రవీణ్, ఆరేపల్లి, కామారెడ్డి

ఉపయోగకరమైన సూచనలు

వాట్స్ యాప్ ఉపయోగించని యువత లేదంటే అతిశయోక్తి కాదు. ఎప్పటి సమాచారాన్ని అప్పుడే పంచుకునే స్నేహితులు దీన్ని ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ఫోన్ కొనేటప్పుడే ఈ అప్లికేషన్ ఉందో లేదో తెలుసుకుని మరీ కొంటున్నారంటే వాట్స్‌యాప్‌కున్న క్రేజ్ అర్థమవుతోంది. దీన్ని వాడేవారు తీసుకోవలసిన జాగ్రత్తలు ఎంతో ఉపయోగంగా ఉన్నాయి.

– సత్యనారాయణ, రాజోలు, మెదక్

ఆటల ప్రభావం తెలిసింది

సోపతిలో వచ్చిన 'బాక్సింగ్ దిగ్గజం మహ్మద్ అలీ' బాగుంది. బాక్సింగ్ చేసే క్రీడాకారులకు భవిష్యత్తులో ఎలాంటి ఆరోగ్య సమస్యలు వస్తాయనే వివరాలు కూడా ఇచ్చారు. మాములుగా అయితే క్రీడకారులు చాలా ఆరోగ్యంగా ఉంటారనుకుంటారు అందరూ. కానీ వాళ్ల ఆటలు మానేసిన తరువాత ఆ ప్రభావం వారిపై ఏ విధంగా ఉంటుందో ఈ వ్యాసం వల్ల తెలిసింది.

– వెంకట్, ఖమ్మం

రంగుల పేజీలు

చివరి పేజీలోని 'మిలమిల మెరిసే తార' ఫొటోలు బాగున్నాయి. కాగితాలతో చేసిన డ్రెస్సులు ఆకర్షణీయంగా ఉన్నాయి. నెమలీకలోని 'ఆ పదం ఏంటో తెలుసా?'లో జవాబు తప్పుగా ఉంది.

– రీనా, హైదరాబాద్

సుఖదుఖాల కలబోత

వర్తమానం నుండే భవిష్యత్తుకు పునాది వేసుకుంటారు. మనిషికి ఏది అందుబాటులో ఉండదో దాని మీదకే మనసు పోతుంది. మనిషి చేసే రకరకాల ఆలోచనల ఫలితమే సుఖదుఖాలుంటాయన్నది వాస్తవం. ఈ విషయం 'వర్తమానం ఆనందపు ఆవరణ' వ్యాసంలో చక్కగా చెప్పారు.

– లలిత, మల్లాపూర్, కరీంనగర్

ఆనాటి పరిస్థితులు

ఆళ్వారు స్వామి గురించి తెలుసుకోడానికి 'ప్రజా రచయిత ఆళ్వారు స్వామి' వ్యాసం ఉపయోగంగా ఉంది. ఆయన జీవితంలోని సంఘటనలను సంక్షిప్తంగా ఇచ్చినా ఎన్నో వివరాలు తెలుసుకున్నట్లు అనిపించింది. పాలకుల దౌర్జన్యం మీద పోరాడుతూ, వాటి గురించి రచనలు చేస్తూ తర్వాతి తరాల వారికి అప్పటి పరిస్థితులు తెలుసుకునేలా రచనలు చేసిన ఆళ్లారు స్వామికి ధన్యవాదాలు చెప్పాల్సిందే.

– వెంకటేష్, బచ్చన్నపేట, వరంగల్

మన జాతీయాలు

రొడ్డ చేయి వాటం

కొందరు కుడిచేతి పనులన్నింటిని ఎడమ చేతితో చేసే అలవాటును కలిగివుంటారు. తుదకు రాసే రాతను కూడా ఎడమ చేతితో రాస్తారు. రొడ్డచేయి వాటం అంటే అదే.

చాలు పొంటి చాలు

చాలు అంటే నాగటి చాలు. చాలు లేదా సాలు అంటే ఆచారం. ఒక వంశ మర్యాద. సమాజంలో అందరు అంగీకరించిన న్యాయం. ఒక తండ్రి వుండేవాడు. ముదుసలితనం వచ్చింది. కొడుకు కుటుంబ యజమానిగా సంపాదనపరుడయ్యాడు. కాని తండ్రిని నానా అగచాట్లకు గురిచేశాడు. గ్రామమంతా అయ్యో పాపమని బాధపడ్డారు. తండ్రి గతించాడు. కాలం గడిచింది. కొడుక్కు కొడుకు పుట్టి కుటుంబ యజమానయ్యాడు. ముందుతరంలో తన తండ్రి తాతగారికి కల్పించిన కన్న ఎక్కువ కష్టాల్ని కలిగించాడు. కొడుకు చాలా బాధలు పెడుతున్నాడని గ్రామపెద్దలకు ఫిర్యాదుచేశాడు. రచ్చగద్దె దగ్గర వున్నవారంతా "చాలుపొంటి చాలు తప్పదు. ఈయన మాత్రం తండ్రిని నిప్పుల మీద పొరలించాడు. అదేచాలు కొడుక్కు వచ్చింది" అన్నారు. అనువంశికంగా పాటిస్తున్న ఆచారం. ఒకనాటి చాలు వెంట (పొంటి) మరొక చాలు సమాంతరంగా కొనసాగుతుంది. అందునుంచి వచ్చిందే ఈ జాతీయం.

చేట్లో బియ్యం నూతిలో నీళ్ళు

అన్నీ సిద్ధంగా వున్నాయనుట. చేట్లో బియ్యం నూతిలో నీళ్ళు చాలినన్ని వున్నవి. పొడిగా వున్నవి తడి చేయటం, వండటం మాత్రమే మిగిలివుంది. అన్నీ సిద్ధంగా వున్న పరిస్థితి. 'కట్టినిల్లు పెట్టిన పొయ్యి' ఇలాంటిదే. ఇది ఉనికికి సంబంధమైంది కాగా ఈ జాతీయం తిండి సంబంధమైంది. "కోడలుకు చేయ చేతగాక ఏవో వంకలు. చేట్లో బియ్యం నూతిలో నీళ్ళు. మొగుడే వండిపెడితే సంతోషం" అనటంలో ఈ జాతీయం ప్రయోగం చూడొచ్చు.

– వేముల పెరుమాళ్లు

■ **సంగీతం**

సంగీతాభిమానులకు వినసొంపైన పాటలను అందించిన సుస్వరాల సంగీత దర్శకులు సుసర్ల దక్షిణామూర్తి నవంబర్ 11, 1921లో జన్మించారు. ఆకాశ వాణిలో ఏ గ్రేడ్ ఆర్టిస్టుగా జీవితాన్ని ఆరంభించిన సుసర్ల సహాయ సంగీత దర్శకునిగా చిత్ర రంగంలోకి ప్రవేశించారు. గాయకుడు, సంగీత దర్శకులు, నిర్మాత, నటునిగా, డబ్బింగ్ ఆర్టిస్టుగా అనేక రంగాల్లో రాణించారు. సంసారంలో 'నిదురపోరా తమ్ముడా' పాటను లతా మంగేష్కర్‌తో తొలిసారి తెలుగులో పాడించిన ఘనత సుసర్లకే దక్కుతుంది. లతామంగేష్కర్, బెంగుళూరు లత, జమునారాణి, పి.లీల వంటి గాయకులను తెలుగు తెరకు పరిచయం చేశారు. మంగళంపల్లి బాలమురళీకృష్ణ వంటి సంగీత స్రష్టతో కూడా సినిమాల్లో పాటలు పాడించగల విద్వత్తు ఆయనకే సొంతం. సంసారం, నర్తనశాల, హరిశ్చంద్ర, అన్నపూర్ణ, శ్రీమద్విరాటపర్వం, శ్రీ మద్విరాట వీరబ్రహ్మేంద్రస్వామి చరిత్ర, సంతానం, ఇలవేలుపు వంటి అనేక చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించారు. అన్ని భాషల్లో కలిపి 135 చిత్రాలకు పనిచేశారు. చివరి దశలో ఆర్థిక పరిస్థితుల వల్ల సంగీత దర్శకులు చక్రవర్తి దగ్గర వయొలిన్ వాయించారు.

గాత్ర మాధుర్యానికి, మధురమైన కంఠానికి మారు పేరు పి.సుశీల. ఆమె గొంతులో పలకని భావం లేదు, ఒలకని రసం లేదు. కమ్మనైన సుశీల కంఠస్వరం నుండి వెలువడిన గానామృతాన్ని విని పులకించని దక్షిణాది హృదయం లేదంటే అతిశయోక్తి కాదు. గాన కోకిల అనిపించుకున్న ఈమె కోకిలా వసంత కాలంలోనే కాదు, అన్ని కాలాల్లోనూ తన సుస్వరాలను వినిపిస్తుంది.

సుస్వరాల, గానకోకిలల గీతామృతం

సుసర్ల దక్షిణామూర్తి

పి. సుశీల

పి. సుశీల 1935, నవంబర్ 13న విజయనగరంలో జన్మించారు. విజయనగరం మహారాజా సంగీత కళాశాలలో పాటల్లో డిప్లొమా చేశారు. 1951లో పెండ్యాల సంగీతం వహించిన 'కన్నతల్లి' చిత్రంలో చిత్ర పరిశ్రమకు పరిచయమయ్యారు. పెండ్యాల మొదలుకొని కె.వి.మహదేవన్, సాలూరి రాజేశ్వరరావు, విశ్వనాథన్ రామమూర్తి, సుసర్ల దక్షిణామూర్తి, ఘంటసాల, ఎం.ఎస్.విశ్వనాథన్, రమేష్‌నాయుడు, రాజన్ నాగేంద్ర, ఇళయరాజా, ఎం.ఎం.కీరవాణి, రాజ్–కోటి... ఇలా ఎంతోమంది సంగీత దర్శకులతో పనిచేశారు. తెలుగుతోపాటు తమిళ, మళయాళ, కన్నడ, సింహళం, హిందీ భాషల్లో వేలకొద్దీ పాటలు పాడారు. ఐదు జాతీయ అవార్డులు, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ నుండి రాష్ట్రస్థాయిలో పలు అవార్డులు, రఘుపతి వెంకయ్య అవార్డు అందుకున్నారు. జానపద, యుగళ, బృంద, శృంగార, కరుణ రస, హాస్య గీతాలు... ఇలా ఒకే కోవకు కాకుండా అన్ని రకాల పాటలు పాడి కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన చిత్రం 'నర్తనశాల'.

'నర్తనశాల'లోని "జననీ శివ కామినీ.. జయసుధకారిణీ విజయరూపిణీ, ఎవ్వరికోసం ఈ మందహాసం.. ఒకపరి వివరించవే.. సొగసరి ఒకపరి వివరించవే..., దరికి రాబోకు రాబోకు రాజా.. దరికి రాబోకు రాబోకు రాజా..., సఖియా వివరించవే.. వగలెరిగిన చెలునికి నా కథా.. సఖియా వివరించవే..." పాటలు ఘంటసాలతో కలిసి సుశీల పాడారు. ఇదే చిత్రంలోని "సలలిత రాగ సుధారస సారం... సర్వ కళామయ నాట్య విలాసం..." పాట బాలమురళీకృష్ణ, బెంగుళూరు లత గానం చేశారు. ఆణిముత్యాల్లాంటి ఈ చిత్రంలోని పాటలన్నీ నేటికీ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి.

'మాయాబజార్' చిత్రంలోని "అహనా పెళ్లియంట... ఓహోనా పెళ్లియంట...నీకు నాకు పెళ్లంట లోకమెల్ల గోలంట టాంటాంటాం...", 'భాగ్యచక్రం' చిత్రంలో "వానకాదు వానకాదు వరదరాజా.. పూలవాన కురియాలి వరదరాజా... వనములేలు బాలరాణి ఎవరో అంటూ.. నగరిలేను బాలరాజు చూడరాదా...", 'గుండమ్మ కథ' చిత్రంలో "అలిగిన వేళనే చూడాలి... గోకుల కృష్ణుని అందాలు", 'ధనమా దైవమా?' చిత్రంలోని "నీ మది చల్లగా.. స్వామీ నిదురపో..., 'మాంగల్యబలం' చిత్రంలోని "ఆకాశవీధిలో అందాల జాబిలి వయ్యారి తారలు చేరి ఉయ్యాలలూగెనే", 'ఆత్మ బంధువు' చిత్రంలో "చదువు రానివాడవని దిగులు చెందకు మనిషి మదిలోన మమతలేని చదువులెందుకు", 'మూగ మనసులు' చిత్రంలో "మాను మాకును గాను రాయి రప్పను కానే కాను, మామూలు మనిషిని నేను", డాక్టర్ చక్రవర్తి చిత్రంలో "నీవు లేక వీణ పలుకలేనన్నది, నీవు రాక రాధ నిలువలేనన్నది, పాడమని నన్నడగవలెనా పరవశించి పాడనా...', 'మంచి కుటుంబం' చిత్రంలో "మనసే అందాల బృందావనం... వేణుమాధవుని పేరే మధురామృతం...", అంటూ బ్లాక్ అండ్ వైట్ చిత్రాల్లోని పాటలను కూడా అలనాటి మధురాలుగా వింటున్నాం.

అలాగే ఈస్ట్‌మన్ కలర్ చిత్రాలైన 'గూడు పుఠాణి' చిత్రంలో "తనివి తీరలేదే నా మనసు నిండలేదే ఏ నాటి బంధమీ అనురాగం... చెలియా.. ఓ చెలియా...", 'ఓ పాపా లాలి' చిత్రంలో "కర్పూర బొమ్మవు నువ్వే లావణ్య రాసివినువ్వే... చిందించు నీలోని అందం, నాలోన కదిలించు రాగం.. ముత్యాలె పూచేనమ్మ మా ఇంటి పంటై నా ప్రాణమే నీవేనమ్మా...", 'దళపతి' చిత్రంలో "ఆడజన్మకు ఎన్ని శోకాలో... చిన్ని నాన్నకు ఎన్ని శాపాలో...", 'పెళ్లి పుస్తకం' చిత్రంలో "శ్రీరస్తూ శుభమస్తు... శ్రీకారం చుట్టుకుంది పెళ్లి పుస్తకం... ఇక ఆకారం దాల్చుకుంది కొత్త జీవితం...", 'స్వర్ణకమలం' చిత్రంలో "ఘల్లు ఘల్లు ఘల్లుమంటూ మెరుపల్లే తుళ్లు... జల్లు జల్లు జల్లున వుప్పొంగు నింగి ఒళ్లు...", ' మమతల కోవెల' చిత్రంలోని "తెలియని రాగం పలికింది తీయని భావనలో.. మనసే జ్యోతిగ వెలిగింది మమతల కోవెలలో... ఈ మమతల కోవెలలో...", 'మేఘసందేశం' చిత్రంలో "ఆకులో ఆకునై పూవులో పూవునై", 'భాగ్యలక్ష్మి' చిత్రంలో "కృష్ణశాస్త్రి కవితలా... కృష్ణవేణి పొంగులా.. పాలలా... తేనెలా.. దేశభాషలందు లెస్సగా..", ' సప్తపది' చిత్రంలో 'రేపల్లియ యెద ఝల్లున పొంగిన రవళి నవరస మురళీ", 'నాయకుడు' చిత్రంలోని "సందెపొద్దు మేఘం పూలజల్లు కురిసెను నేడు" 'సిరిసిరిమువ్వ' చిత్రంలో "ఝుమ్మంది నాదం సయ్యంది పాదం", 'మేఘ సందేశం'లోని 'ప్రియే చారుశీలే"... ఇలాంటి ఎన్నో వేల పాటలను ఘంటసాల, ఎస్.పి.బాలసుబ్రమణ్యం, రామకృష్ణలతో పాడి తన శ్రావ్యమైన కంఠం ద్వారా శ్రోతలను మంత్రముగ్ధులను చేశారు.

– బి.మల్లేశ్వరి

■ కవర్ స్టోరీ

స్ఫూర్తిదాయక చరితలు



మనిషి జీవించేది ఒకేఒక్కసారి.

మళ్ళీ రమ్మన్నా రాదు జీవితం.

ఉన్న ఒక్క జీవితాన్ని నాలుగు కాలాల పాటు నలుగురు గుర్తుంచుకునేలా జీవించడమే మనిషి జన్మకు ధన్యత. అలాంటి ధన్యజీవుల జీవితాలు స్ఫూర్తిదాయక చరితలు.

వారి ఆత్మకథలు, జీవితచరిత్రలు, జ్ఞాపకాలు మానవాళిలో మంచిని కొనసాగించే లక్షణానికి కరదీపికలు.

సమాజాన్ని మరింత మానవీయంగా మార్చగల అంశ ఇలాంటి వారికే సాధ్యం.

ఈ కోవకు చెందిన మనుషుల బతుకుయానం మరల మరల చదవదగ్గ పాఠ్యాంశం.

ఒక పాఠ్యాంశం స్థాయికి చేరుకునేలా జీవించిన మహనీయులు సదా స్మరణీయులు.

భౌతికంగా లేకున్నా సదా జీవించడం, జీవిస్తూ పరిమళించడం, ప్రభావితం చేయడం ఈ మనీషుల వైశిష్ట్యం.

భూమి పుట్టినప్పట్నించి ఎందరెందరో మనుషులు పుడుతూ గిడుతూ వున్నారు. కానీ కొందరు మాత్రమే గుర్తుండటానికి కారణం వారి జీవితాలు కాలంపై చేసిన చెరగని సంతకాలు.

గుర్తుండటం ఒక్కటే ప్రాతిపదిక కాదు.

అలెగ్జాండర్, నెపోలియన్, హిట్లర్‌లు కూడా గుర్తుంటారు. కానీ అలాంటి యుద్ధపిపాసులు కాదు, మానవాళి జీవితాన్ని మరింత సారవంతం చేయడానికి తోడ్పడినవారే నిజమైన స్ఫూర్తిదాతలు. ఈ భూమ్మీద ఇలాంటి మనుషులు నడిచారంటే రానున్న తరాలు ఆశ్చర్యపోయే కోవకు చెందిన మనీషుల జీవితగాథలే ఉత్తేజకరం.

తమ మేలు కన్నా పరుల మేలు ముఖ్యంగా భావించి, అంతరాల్లేని సమాజం కోసం పాటుపడినవారే నిజమైన వికాసానికి దీపధారులు. అలాంటి వారి జీవితచరిత్రలే మనుషుల్లో సిసలైన వ్యక్తిత్వ వికాసానికి ఉపకరణాలు.

అగ్రగామి మార్క్స్ జీవితచరిత్ర

ఈ కోవలో అగ్రగామి కారల్‌మార్క్స్ జీవితచరిత్ర. అన్నిరకాల పీడనల్నించి మానవాళి విముక్తికి దారిచూపిన మార్క్సిస్టు సిద్ధాంతాన్ని సృజించిన మహనీయుడు. అరకొర సౌకర్యాలతో జీవితం గడుపుతూ 'కాపిటల్' గ్రంథాన్ని రచించిన మార్క్స్ జీవితానికి సంబంధించిన జీవితచరిత్రల్ని, జ్ఞాపకాల్ని యువతీయువకులు చదవాలి. ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని, ఆ దారిలో ప్రయాణించేవారు అధ్యయనం చేసి తీరాల్సిన గ్రంథం మార్క్స్ జీవితచరిత్ర. ఈ క్రమాన ఎంగెల్స్ జీవితాన్ని కూడా చదవాలి. ఒక ఫ్యాక్టరీ యజమానిగా మిగిలిపోతే ఎంగెల్స్‌ని ఎవరూ గుర్తు పెట్టుకోకపోయేవారు. ఎందుకంటే చరిత్రలో ఎందరో వాణిజ్యవేత్తలు బతికినంత కాలం బతికి వెళ్ళిపోయారు. వారు బతికిన కాలంలో విలాసంగా గడిపి వుండొచ్చు. కానీ ప్రపంచం వారిని అట్టే మరిచిపోయింది.

ధనవంతుడయినప్పటికీ ఎంగెల్స్ కమ్యూనిస్టు ప్రణాళికను రచించడంలో, మార్క్సిస్టు సిద్ధాంతాన్ని సృజించడంలో, కార్మికవర్గ నియంతృత్వం ఒక్కటే రాజ్యరహిత సమాజ స్థాపనకు మార్గం చూపుతుందన్న సూత్రీకరణల్ని ప్రోది చేయడంలో పోషించిన కీలకపాత్ర మాత్రమే ఎంగెల్స్‌ను గుర్తు పెట్టుకోడానికి మూలం. 'మార్క్సు, ఎంగెల్సు ఆత్మీయుల స్మృతుల' గ్రంథాన్ని చదివితే ఈ మహనీయుల గొప్పతనం తెలుస్తుంది.

మార్క్సిజాన్ని అనుసరించి ప్రజల విముక్తి పోరాటాలకు జీవితం అంకితం చేసిన వారి జీవితచరిత్రలు, ఆత్మకథలు తప్పనిసరిగా చదవదగ్గ గ్రంథాలు. లెనిన్ జీవితకథ, 'ఉక్కుమనిషి స్టాలిన్' వంటి పుస్తకాలు చదివితే సోవియట్ రష్యాలో వారు తెచ్చిన విప్లవం ప్రాశస్త్యం తెలుస్తుంది. ఇరవయ్యో శతాబ్దిలో ఘనమైన మార్పులకు సోవియట్ విప్లవం అందించిన తోడ్పాటు అమేయమైంది. ఆ విప్లవంలో, విప్లవస్ఫూర్తిని కొనసాగించడంలో లెనిన్, స్టాలిన్ పాత్రలు తెలుసుకోవడం అవసరం.

అలాగే దేశదేశాల విముక్తి పోరాటాల్లో కీలకపాత్ర పోషించిన వారి ఆత్మకథలు, జీవితగాథలు తప్పనిసరి పఠనీయ గ్రంథాలు. చేగువేరా 'మోటర్‌సైకిల్ డైరీ', ఫైడల్ కాస్ట్రో 'నా తొలి జీవితం' చదవాల్సిన పుస్తకాలు. వియత్నాం విముక్తి ప్రదాత హోచిమిన్ కవిత్వం, జీవితచరిత్ర ఎంతో ఉత్తేజాన్నిస్తాయి.

ఈ దేశంలో మూడు దశాబ్దాలపైబడి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేసిన మార్క్సిస్టు యోధుడు జ్యోతిబసు సృజించిన 'నా రాజకీయ జీవితంలో కొన్ని జ్ఞాపకాలు' కూడా చదవాలి. వారి సుదీర్ఘ రాజకీయ జీవితంలో చూపిన తెగువ, ధైర్యసాహసాలు, సడలని దీక్ష గురించి తెలుసుకోడానికి ఈ పుస్తకాన్ని శ్రద్ధగా అధ్యయనం చేయాలి. భారతదేశంలో కమ్యూనిస్టు సిద్ధాంతాల్ని, విలువల్ని జీవిత పర్యంతం వరకు అనుసరించిన త్యాగమయుల జీవితచరిత్రల్ని, స్వీయచరిత్రల్ని ఇంకా విస్తృతంగా తెలుగులోకి తీసుకురావాలి. ఈ క్రమాన వ్యక్తిత్వ వికాసమంటే కేవలం తమ కెరీర్‌లో రాణించడమే కాదు, సమాజమార్పు క్రమంలో భాగస్వాములు కావడమని అర్థమవుతుంది. అందువల్ల పోరాటమార్గంలో ప్రయాణించిన కమ్యూనిస్టు యోధుల జీవితగాథలు ఎంత విస్తారంగా అందుబాటులో వుంటే అంత మంచిది.

తెలుగునాట పోరాటకారులు ఎందరో!

తెలంగాణ సాయుధపోరాటచరిత్రను రాసిన పుచ్చలపల్లి సుందరయ్య ఆత్మకథ అత్యంత ఉత్తేజకరమైన గాథ. కమ్యూనిస్టులు ఎంత ఆదర్శప్రాయంగా ఉండాలో జీవించి చూపారు సుందరయ్యగారు. వారి జీవనయానంలో ఏ అధ్యాయం చూసినా అనేకానేక ప్రత్యేకతలు కనిపిస్తాయి. అరవై, డెబ్బయి ఏళ్ళ కిందట అణగారిన తెలుగు సమాజంలో, తెలంగాణలో అనూహ్యమైన మార్పులకు దోహదం చేసిన పోరాటంలో సుందరయ్య గారి పాత్రను వారి ఆత్మకథ ఆవిష్కరిస్తుంది. నిజాయితీ, నిబద్ధత వంటి విలువల్ని శిరోధార్యంగా భావించి జీవించాలన్న భావాల్ని ప్రబోధిస్తుంది సుందరయ్య గారి జీవితం. ఏ రంగంలో రాణించాలనుకున్నా, ఏ స్థాయిలో జీవించాలనుకున్నా నిజాయితీ, నిబద్ధత తప్పనిసరి. ఈ విలువల ఫలితాలు ఎలా వుంటాయో

శ్రీకారం చుట్టిందెవరు?

తెలుగులో ఆత్మకథలనే మాటకి ముందు స్వీయచరిత్రలనే మాటనే ఉపయోగించారు. తొలి తెలుగు ఆత్మకథగా కందుకూరి వీరేశలింగం పంతులు గారి 'స్వీయచరిత్ర' ప్రాచుర్యంలో వుంది. నిజానికి 'స్వీయచరిత్ర' అన్న మాటని సృష్టించిన వరు కందుకూరి వారు కాదు. ఆయనకన్నా పది, పదిహేనేళ్ళ పూర్వమే గురజాడ శ్రీరామమూర్తి పంతులు గారు రచయిత తన చరిత్రను తానే రాసుకోవటమనే అర్థంలో ఈ పదాన్ని ఉపయోగించారు. కవులు తమ స్వీయచరిత్రలు తామే ప్రకటించుకోవటం అభిలషణీయమని ఆయన సూచించారు. ఈవిధంగా వాడుకలోకి వచ్చిన పదాన్ని కందుకూరి వీరేశలింగం వాడుకున్నారు. వీరి కన్నా ముందుగానే వెన్నెలకంటి సుబ్బారావు ఇంగ్లీషులో తన జీవితగాథ రాసుకున్నారు. మహా మహోపాధ్యాయ పరవస్తు వేంకట రంగాచార్యులు స్వీయచరిత్రను సంస్కృతంలో రాశారు. ఆ తర్వాత కాలాన పద్యరూపంలో మండపాక పార్వతీశ్వర శాస్త్రి గారు స్వీయచరిత్ర రాశారు. ఈరకంగా వీరేశలింగం కన్నా ముందుగానే తెలుగునాట స్వీయచరిత్రలు వెలువడటం గమనార్హం. అయితే ఆధునిక స్వరూప స్వభావాలతో సమగ్రమైన స్వీయచరిత్రగా కందుకూరి వీరేశలింగం పంతులు రాయడం వల్ల ప్రసిద్ధి చెందింది. ఇలాంటి అనేక విషయాలు 'తెలుగులో స్వీయచరిత్రలు' శీర్షికన అక్కిరాజు రమాపతిరావు గారు రాసిన పుస్తకంలో వున్నాయి. దీనిని 1984లోనే 'యువభారతి' ప్రచురించింది.

తెలుగులో ఆత్మకథ అనే మాట ఎప్పుడు, ఏవిధంగా ప్రాచుర్యంలోకి వచ్చిందన్న వివరాలు అందుబాటులో లేవు. కాని చలం తన ఆత్మకథకి రాసిన ముందుమాటలో 'ఆత్మకథ' అనే మాటనే వాడారు. కాగా 'ఆత్మచరితము' అనే శీర్షికన రాయసం వెంకటశివుడు ఆత్మకథ 1933 సంవత్సరంలోనే వచ్చింది. అయితే తెలుగునాట ఆత్మకథలు, జీవితచరిత్రలు రచించే అలవాటు ఆశించనంతగా పెరగలేదు. ఇప్పటికీ మనకు విభిన్నరంగాల వారి జీవితచరిత్రలు లేవు. ఇటీవలి సంవత్సరాల్లో మాత్రమే ఆత్మకథలు, జీవితచరిత్రలు కళాకారుల, సాహిత్యకారుల, రాజకీయ నాయకుల నుంచి వస్తున్నాయి. ఇంకా విస్తారంగా వస్తే ఆయా కాలాల్లోని సామాజిక జీవితం వెలుగులోకి వస్తుంది.





చెబుతుంది సుందరయ్య గారి ఆత్మకథ.

తెలంగాణ సాయుధపోరాటంలో పాల్గొన్న అనేకమంది తమ జ్ఞాపకాల్ని రికార్డు చేశారు. వాటిలో ఎన్నో విలువైన గ్రంథాలున్నాయి. మాకినేని బసవపున్నయ్య గారి జ్ఞాపకాలు కూడా తప్పనిసరిగా చదవాలి. అలాగే కమ్యూనిస్టులకు పత్రికలు ఎంత ముఖ్యమైనవో వి.ఆర్.బొమ్మరెడ్డి గారి 'జ్ఞాపకాలు అనుభవాలు' గ్రంథం వివరిస్తుంది.

తెలంగాణలో మరికొన్ని స్వీయచరిత్రలు

తెలంగాణ సాహితీ సాంస్కృతికోద్యమాలు, రాజకీయ, సామాజిక ఉద్యమాలు కొందరి స్వీయచరిత్రల్లో, మరికొందరి జీవితచరిత్రల్లో ఆవిష్కృతమయ్యాయి. ముఖ్యంగా మాదిరాజు రామకోటేశ్వరరావు, రావి నారాయణరెడ్డి, మందుముల నరసింగరావు, కొండ వెంకట రంగారెడ్డి, కోదాటి నారాయణరావు స్వీయచరిత్రలు ఈ కోవలోకి వస్తాయి. మాడపాటి హనుమంతరావు గారి ఆత్మకథలో ఆంధ్రోద్యమ చరిత్ర వ్యక్తమైంది. నిజాం నవాబులపై తిరుగుబాటు, తెలంగాణలో వెట్టిచాకిరి, భూస్వామ్యపీడనలకు వ్యతిరేకంగా వెల్లువెత్తిన చైతన్యం దాశరథి కృష్ణమాచార్య గారి స్వీయచరిత్రలోనూ, దాశరథి రంగాచార్య గారి 'జీవనయానం'లోనూ కనిపిస్తాయి. దేవులపల్లి రామానుజరావు ఆత్మకథలో తెలంగాణలో సాంస్కృతిక పునరుజ్జీవనం ప్రస్తావనలున్నాయి.

స్వాతంత్ర్యానికి పూర్వం తెలంగాణ ప్రాంతంలోని పరిస్థితుల్ని కొందరి





స్వీయచరిత్రలు తెలియజేస్తాయి. గ్రంథాలయోద్యమం, ఆంధ్రమహాసభ, తెలంగాణ సాయుధ పోరాటకాలంలో పలువురు పోషించిన చారిత్రక పాత్రను చిత్రించిన జీవితచరిత్రలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు సురవరం ప్రతాపరెడ్డి రచించిన కోత్వాల్ రాజబహద్దూర్ వేంకటరామారెడ్డి జీవితచరిత్ర తప్పనిసరిగా అధ్యయనం చేయాలి. అలాగే ఎల్లూరి శివారెడ్డి రాసిన సురవరం ప్రతాపరెడ్డి జీవితచరిత్ర అలనాటి తెలంగాణ సామాజిక చైతన్యాన్ని ప్రతిఫలిస్తుంది. తెలంగాణలోని సాంఘిక జీవనాన్ని పరిస్థితులను ఆత్మకథలో కూడా చూస్తాం. ఇవన్నీ కూడా తెలంగాణలో భూస్వామ్య వ్యవస్థ అణచివేత నుంచి సామాజిక చైతన్యం వెల్లువెత్తే క్రమంలో ప్రజల చరిత్రను, ఆ చరిత్రలో భాగస్వాములయిన వారి కృషిని తెలియజేస్తాయి. కనుక వీటిని కూడా స్ఫూర్తిదాయక చరితలుగా చూడొచ్చు.

దీప్తిమంతమైన 'నేను–నా దేశం'

స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వామి అయిన దర్శి చెంచయ్య 'నేను – నా దేశం' శీర్షికన రచించిన ఆత్మకథ కూడా చెప్పుకోదగింది. 1911లో అమెరికాలో కాలిఫోర్నియాలో భారత స్వాతంత్ర్యోద్యమం కోసం గదర్ పార్టీ ఏర్పాటులో చెంచయ్యది కూడా కీలక పాత్ర. ఆయనది సాహసోపేతమైన విప్లవ జీవితం. దేశం కోసం జీవించడంలోని మహత్తునీ, త్యాగశీలతనీ అత్యంత దీప్తిమంతంగా రచించారు. సాదాసీదా శైలితో కూడిన ఈ గ్రంథంలో చదివించే గుణం వుంది. ఏదో సాహసం చేస్తున్నానన్న భావనతో కాకుండా చాలా సహజంగా పోరాటంలో భాగస్వామి అయి, ఆ విలువలతోనే జీవితాంతం గడిపిన దర్శి చెంచయ్య జీవితం నుంచి ఈతరం యువకులు ఎంతో నేర్చుకోవచ్చు. నిరాడంబరంగా, అసంకల్పితంగా పదుగురి కోసం జీవించడంలోని రమ్యతను అర్థం చేసుకోడానికి ఉపయోగపడే స్వీయచరిత్ర ఇది.

వివాదాలే లక్ష్యం కారాదు

పుస్తకాల మార్కెట్‌లో వివాదాస్పదమైన ఆత్మకథలకు డిమాండ్ ఎక్కువ. ఇంగ్లీషు బుక్ మార్కెట్‌లో ఈ ధోరణి ఎక్కువ. కనుకనే సచిన్ టెండూల్కర్ ఆత్మకథ వెలుగులోకి వచ్చేముందు కోచ్ గ్రెగ్ చాపెల్ మీద రాసిన భాగాలు బయటికి వచ్చాయి. ఆత్మకథలో సచిన్ చెప్పిన మాటల్ని సమర్థిస్తూ మరికొందరు క్రికెటర్లు వ్యాఖ్యానాలు చేశారు. ఇవ్వన్నీ కలిసి సచిన్ ఆత్మకథకు మంచి డిమాండ్‌ను తెచ్చిపెట్టాయి. ఈ వివాదాల్లో నిజానిజాలు ఎలా వున్నా, వీటి కారణంగా ఆ పుస్తకానికి క్రేజ్ ఏర్పడింది. అమ్మకాల జోరుకు ఉపకరించే మార్కెటింగ్ వ్యూహమిది. కానీ వివాదాలే లక్ష్యంగా ఏర్పరుచుకుని ఆత్మకథల్లో కొన్ని భాగాల్ని చొప్పించడం చౌకబారుతనం. నిజానిజాలు నిర్భయంగా చెబితే ఫరవాలేదు. కానీ వివాదాస్పద మాటల ద్వారా లబ్ది పొందాలనుకుంటే విశ్వసనీయత పెరగదు. కనుక ఆత్మకథలకి వివాదాలు, సంచలనాలు లక్ష్యంగా ఉండకూడదు. అలా లేనప్పుడే ప్రముఖులు జీవితగాథల పట్ల ఆసక్తి, నమ్మకం ఏర్పడతాయి.

విభిన్నరంగాలకు చెందిన గురుదత్, దేవానంద్, వైజయంతిమాల, శివాజీ గణేశన్, పండిట్ రవిశంకర్, సునీల్ గవాస్కర్, వర్గీస్ కురియన్, కుష్వంత్‌సింగ్, ఆర్.కె.నారాయణ్, భమిడిపాటి రామగోపాలం, డి.వి.నరసరాజు, సామల సాదాశివ, యామినీ కృష్ణమూర్తి, మృణాళిని సారాభాయ్ వంటి వారి ఆత్మకథలకు ఆదరణ వుంది. ప్రముఖులు కావడం వల్లనే వారి జీవితాల తీరుతెన్నుల పట్ల ఆకర్షణ అన్నది గమనించాలి.

అయితే హెలెన్ కెల్లర్, నెహ్రూ, టాగోర్, భగత్‌సింగ్, సర్వేపల్లి రాధాకృష్ణన్, మదర్ థెరిసా, కమలాదాస్, బెర్ట్రాండ్ రస్సెల్, సెయింట్ ఆగస్టీన్, రూసో లాంటి వారి జీవితచరిత్రలు, ఆత్మకథల్లో కొన్ని స్ఫూర్తిదాయక అంశాలు, మరికొన్ని చారిత్రక వాస్తవాలు మిళితమై ఆకర్షణీయంగా ఉంటాయి. ఈ కోవలో తెలుగువారిలో సంజీవదేవ్ స్వీయచరిత్ర ఆకర్షణీయం. ఎం.ఎస్.రాజలింగం, ఆలూరి భుజంగరావు, తాపీ ధర్మారావు, ఆచంట జానకీరామ్, శ్రీశ్రీ, మామిడిపూడి వెంకటరంగయ్య, గడియారం రామకృష్ణశర్మ, తిరుమల రామచంద్ర, ఉప్పల లక్ష్మణరావు, రాంభట్ల కృష్ణమూర్తి, బూదరాజు రాధాకృష్ణ వంటి మరెందరి జీవితచరిత్రలు, ఆత్మకథలు ఒకనాటి సమాజాన్ని, ఆ సమాజంలోని విలువైన అంశాల్ని వివరిస్తాయి. అందువల్లనే జీవితగాథలు చదవడం ఉపయుక్తం.





ఆత్మశక్తిని ఆవిష్కరించే గాంధీ ఆత్మకథ

ప్రపంచమంతా గాంధీ జీవితాన్ని ఘనంగా శ్లాఘించడం తెలిసిందే. మార్క్సిస్టు దృష్టికోణం నుంచి చూసినప్పుడు ఆయనతో విభేదించాల్సిన అంశాలుంటాయి. స్వాతంత్ర్య పోరాటకాలంలో ఆయన నిర్ణయాలు కొన్ని వివాదాస్పదమైనవి. కానీ గాంధీ నిజాయితీని, సత్యసంధతను, నిరాడంబరతను కాదనలేము. తాను నిర్దేశించుకున్న విలువల కోసం కట్టుబడి జీవించడంలో గాంధీ చూపిన ఆత్మశక్తి యువతీయువకులకు మంచిపాఠం. పట్టుదల, దృఢ నిశ్చయం, నిబద్ధత, నిజాయితీ వంటి విలువలు పాటించడంలో ఎన్నో పరీక్షలు ఎదుర్కొన్నారు గాంధీ. అయినప్పటికీ వాటిని వీడకపోవడం సుగుణం. ఈ లక్షణాలు స్ఫూర్తిదాయక అంశాలు. అందుకని గాంధీ ఆత్మకథని విమర్శనా దృష్టితో చూస్తూనే అధ్యయనం చేయాలి.

గాంధేయ విలువల స్ఫూర్తి మలాలాలో కూడా కనిపిస్తుంది. తూటాల్ని ఎదుర్కొన్న మలాలా ముస్లిం సమాజాల్లో ఆడపిల్లల చదువుకోవాలన్న సందేశాన్ని పరివ్యాప్తం చేస్తుంది. భయాన్ని జయించి నిలబడ్డ మలాలా ఈతరం అమ్మాయిలకు స్ఫూర్తిదాయకం.

స్వేచ్ఛకు విలువనిచ్చి, ఆ స్వేచ్ఛకోసమే జీవితమంతా పరితపించి, నమ్మిన విలువల ప్రకారం జీవించిన లక్ష్మీ సెహగల్ జీవితం ఒక గొప్ప పాఠం. 'విప్లవపథంలో నా జీవితం' అన్న ఆమె గ్రంథం ఒకటికి రెండుసార్లు చదవాలి. 1947 తరువాత కాలంలో ఎందరెందరో పదవులకు అమ్ముడుపోయి విలువల్ని త్రోసిరాజన్నారు. కానీ సమాజంలో మార్పు రావాలన్న ఆకాంక్షతోనే ఆఖరు క్షణం వరకు ప్రజల కోసం జీవించిన పోరాట యోధురాలు లక్ష్మీ సెహగల్. అత్యంత సాహసోపేతమైన ఆమె జీవితం అధ్యయనం చేయదగ్గ పాఠం. తన కోసం కాక, ప్రజల కోసం, దేశం కోసం ధైర్యసాహసాలతో బతకాలన్న సందేశం ఆమె జీవిత పయనంలో కనిపిస్తుంది.

ఈ విలువలే అంబేద్కర్‌లోనూ కనిపిస్తాయి. అంటరానితనాన్ని అధిగమించి, స్వతంత్ర భారతదేశానికి దిశా నిర్దేశం చేసిన రాజ్యాంగం రూపకల్పనలో అంబేద్కర్‌ది ప్రధానపాత్ర. అటువంటి అంబేద్కర్ జీవితగాథ అత్యంత ప్రభావిత శక్తి కలిగినటువంటిది. ఆత్మవిశ్వాసాన్ని, ధైర్యాన్ని, నికార్సుగా నిలబడే తత్వాన్ని అందించే జీవితగాథ అంబేద్కర్‌ది. అంబేద్కర్ మాదిరిగానే అణగారిన వర్గాల వారి పక్షాన నిలబడిన ఒకనాటి రాష్ట్రపతి కె.ఆర్.నారాయణ్ జీవితం కూడా స్ఫూర్తిదాయకం. 'జీవితం వడ్డించిన విస్తరికాదు, పోరాడి సాధించుకోవాలి' అన్న పాఠం నేర్పుతుంది. ధిక్కారం చూపాల్సివచ్చినపుడు ధిక్కరించడం అనివార్యమనే సత్యాన్ని అలవరుస్తుంది.

పదుగురి మేలు కోసం బతకడంలోని ఉదాత్తతని తెలియజెప్పే ఇలాంటి స్వీయచరిత్రలు, జీవితచరిత్రలు చిన్నప్పట్నించి చదవడం వల్ల జీవితం పట్ల నిర్దిష్టమైన దృక్పథం ఏర్పడుతుంది. పరుల మేలు తలచడమే కాదు, వారికి మేలు చేకూర్చేందుకు జీవించాలన్న చైతన్యం అవసరం. ఆ చైతన్యాన్ని కల్పించే శక్తి ఆత్మకథలకు వుంది. ఈ కారణంగానే దేశదేశాల ప్రజలు మార్క్స్, ఎంగెల్స్, గాంధీ, టాగూర్, టాల్‌స్టాయ్, గోర్కీ వంటి వారి జీవితచరిత్రల్ని అధ్యయనం చేస్తున్నారు. సమాజంలో ఉత్తమ విలువలు పాదుకొల్పడానికి ఉపకరిస్తుందీ అధ్యయన సంస్కృతి. వికాసమంటే పరుల నెత్తి గొట్టి బతకడం కాదనే సత్యాన్ని తెలియజేస్తుంది. ఇతరులకు వీలయినంత మేలు చేకూరేలా బతకడంలోని ఔన్నత్యాన్ని అలవరుస్తుంది. మహిళల్ని గౌరవించడం, పెద్దల పట్ల మర్యాదగా ప్రవర్తించడం, విలువలతో బతకడం వంటి లక్షణాలు ఈ తరంలో ఏర్పడాలనుకుంటే ప్రతి ఇంట పిల్లలు, పెద్దలు స్ఫూర్తిదాయక జీవితగాథలు చదవాలి.

– కె.పి.అశోక్‌కుమార్, 97000 00948

మహిళల స్వీయచరిత్రలు అరుదు

తెలుగునాట మహిళోద్యమాల గురించి, మహిళల పోరాటాల గురించి, వివిధరంగాల్లో చేసిన కృషి గురించి కొందరు మహిళలు స్వీయచరిత్రలు రాసుకున్నారు. అయినప్పటికీ ఈనాటికీ తెలుగులో మహిళల స్వీయచరిత్రలు తక్కువే. ఏడిదము సత్యవతి రచించిన 'ఆత్మచరితము' తెలుగులో మహిళలకు సంబంధించి తొలి స్వీయచరిత్ర. 1934లో తొలిసారి అచ్చయింది. మహిళల ఆత్మకథల్లో ఊటుకూరు లక్ష్మీకాంతమ్మ ఆత్మకథ కూడా చెప్పుకోదగింది. బసవరాజు రాజ్యలక్ష్మమ్మ, మల్లాది సుబ్బమ్మ, అడవికొలను పార్వతి, లత, గోపరాజు సీతాదేవి, ఆరుట్ల సరళాదేవి, పద్మ, సంగెం లక్ష్మీబాయమ్మ మరికొందరి ఆత్మకథలు వచ్చాయి. ప్రఖ్యాత సినీనటి భానుమతి తన అనుభవాలు రచించారు. 'పాలేరు నుంచి పద్మశ్రీ' వరకు అనే స్వీయచరిత్రను భీమన్న, హైమావతి కలిసి రచించారు. సంగెం లక్ష్మీబాయమ్మ 'నా అనుభవములు' అనే శీర్షికన తన ఆత్మకథను 1962లోనే వెలువరించారు. హేమలతా లవణం 'ఇదీ నా జీవితం' అంటూ 75 ఏళ్ళ వయసులో ఆత్మకథ రాశారు. ఇది అత్యంత ఆసక్తికరం.

ఇటీవల ముదిగంటి సుజాతారెడ్డి 'ముసురు' శీర్షికన తన జ్ఞాపకాలు రచించారు. ఇది ఆమె ఆత్మకథ. నల్లగొండ జిల్లా పల్లెల్లో 1948కి పూర్వం మహిళలు చదువుకోవడం అరుదు. అలాంటి పరిస్థితుల్ని, అలనాటి జీవితాన్ని, తర్వాత కాలంలో వస్తున్న మార్పుల్ని సుజాతారెడ్డి గారు చిత్రించారు.

సాహిత్యరంగంలోనే మహిళలే కాదు ఇతర రంగాల వారు కూడా ఆత్మకథలు రాయాలి. తెలంగాణ పోరాటంలో పాల్గొన్న వీరోచిత మహిళలు ఎందరో! ఆరిలో పద్మ జ్ఞాపకాలు పోరాటం ఉదాత్తతను, పోరాటంలో మహిళల త్యాగాలను వివరిస్తాయి. మహిళలు ఎక్కువమంది ఆత్మకథలు రాస్తే సమాజం పట్ల, జీవితం పట్ల వారి దృక్పథం తెలుస్తుంది. మహిళల అంతరంగం, కృషి వెలుగులోకి వస్తాయి. మహిళా చైతన్యం తీరుతెన్నులు అవగతమవుతాయి. అందుకని మహిళల ఆత్మకథలు, జీవితచరిత్రలు రావాలి.

■ **అనువాద కథ**

నా వాహనం పజేరోని జిల్లా కేంద్రంలోనే వదిలేసి - నేను, నా పి.ఎ. కాలినడకన బయల్దేరాం. అది గ్రామీణ రహదారి. ఎక్కడ చూసినా దుమ్ము.. ధూళి... దారుణమైన దుర్గంధం... పెంటా పేడా...

గ్రామాలు ఎందుకింత చెత్తగా తయారయ్యాయి?

నేను మా గ్రామం వైపు నడుస్తున్నాను. ఎన్నికలలో గెలిచిన తర్వాత నాయకులు తమ ఊర్లని మర్చిపోతుంటారని జనాలు తరచూ ఫిర్యాదు చేస్తూంటారు. అటువంటి వాళ్ళ నోళ్ళు మూయించాలనుకుంటున్నాను. ఎన్నికలలో గెలిచి, రాజధానికి వెళ్ళాక, మా ఊరికి నేను రావడం ఇదే మొదటిసారి. నేనేదో కొత్త ప్రాంతంలో ఉన్నట్లు అనిపించింది. నా జేబులో కొన్ని చాకెట్లున్నాయి. అక్కడ పిల్లలకి వాటిని పంచుతాను.

గ్రామసీమల్లో మంత్రిగారి పాదయాత్ర

"మంత్రిగారూ, బహుశా మనం దారి తప్పినట్లున్నాం..."

"ఓ, అవునా." అని తేలికగానే అన్నా, పి.ఎ. ఈ విషయం చెప్పగానే కొంచెం కంగారు పడ్డాను. చుట్టూ చూసాను.

"మెయిన్ రోడ్డు సల్లాఘరీ గ్రామం దగ్గర విడిపోతుంది.. కాని మనం ధర్మాపూర్ గ్రామంలో ఉన్నాం..." చెప్పాను నుదుటిమీద చెమట తుడుచుకుంటూ.

"ఓ పని చేద్దాం సార్. ఇక్కడున్న ఈ జాడల్ని పట్టుకుని సల్లాఘరీకి వెడదాం. ఇది దగ్గర దారిలా ఉంది..." చెప్పాడు పి.ఎ. నేను తలూపాను.

ఈ గ్రామం అంటే నా పి.ఎ.కి ఇష్టంలా ఉంది. అతని సలహా పాటించి నేను అక్కడి జాడలని అనుసరించాను. పైగా ధర్మాపూర్ గ్రామానికి వెళ్ళడం నాకేం ఇష్టం లేదు. అక్కడే నాకు అతి తక్కువ ఓట్లు వచ్చాయి. మొత్తం మూడు వందల ఓట్లు.. అంతే!

"దొంగవెధవలు.. అరవై వేలు నొక్కేసారు..." అంటూ లోలోపల ధర్మాపూర్ గ్రామస్తులని తిట్టుకున్నాను. "ఈ ఏడాది బడ్జెట్‌లో ఈ గ్రామానికి ఒక్క రూపాయి కూడా రాకుండా చూస్తాను..." అని మనసులో శపథం చేసుకున్నాను.

నేను మనసులో అనుకున్నా, నా అంతరంగాన్ని పసిగట్టినట్లుగా... "అవును సార్. ఈ గ్రామానికి మనం బడ్జెట్‌లో నిధులు ఇవ్వద్దు.." అన్నాడు పి.ఎ.

★★★

నాకు విసుగొస్తోంది. ఈసారి మేము సల్లాఘరీ దాటి వెళ్ళిపోయాం. ప్రస్తుతం చిత్రాపూర్ గ్రామం సరిహద్దులో ఉన్నాం.

"మూర్ఖుడా.. మనం ఈ ఊరిలో అడుగుపెట్టలేం... ఊర్లోకి వెడితే వెంటపడి తంతారు..." అన్నాను.

ఈ మాటలు అనగానే పి.ఎ. నిలువెల్లా వణకసాగాడు. "మన మీద మెరుపుదాడి జరిగే ప్రమాదం ఉన్నట్లుంది... మనం సల్లాఘరీ వెళ్ళిపోదాం సర్..." అన్నాడు. పాంటు తడిపేసుకునేంతగా భయపడుతున్నాడు.

మళ్ళీ రోడ్డెక్కాం. సల్లాఘరీ దారిలో నడుస్తున్నాం. వారి గ్రామంలో కొత్తవాళ్ళని చూసినట్లున్నారు, కొంతమంది పిల్లలు మా వెంటే రాసాగారు. జేబులో ఉన్న చాక్లెట్‌లు తీసి వాళ్ళకిచ్చాను.

★★★

మెయిన్ రోడ్ విడిపోయిన చోట ఊరు ఉంది.. కాని అది సల్లాఘరీ గ్రామమో లేక బంశ్‌ఘరీ గ్రామమో నాకు సరిగ్గా తెలియలేదు. ఈ రెండు ఊర్లకి నేను పొరపాటు పడ్డాను. చేసేందేం లేక గ్రామంలోకి నడిచాము.

సల్లాఘరీ సర్పంచ్ నన్ను చూస్తునే చేతులు నులుముకుంటూ స్వాగతం పలికాడు.

"మంత్రిగారూ, రాకరాక మా ఊరొచ్చారు. కాస్త టీ తాగి వెళ్ళండి..."

అన్నాడు.

రాజధాని వదిలి వచ్చాకా, మొదటిసారిగా చేతులు నులుముకుంటూ మాట్లాడే వ్యక్తిని చూస్తున్నాను. నా హృదయం తేలికపడింది.

"మీ గ్రామంలో ఏ సమస్యలున్నాయి?" అని సర్పంచ్‌ని అడిగాను.

"మంచి నీరే అతి పెద్ద సమస్య..."

"కాస్త ఓపిక పట్టవయ్యా. కంగారు పడకు. మనకి ఐదేళ్ళ సమయం ఉంది. మీ ఊరే మునిగిపోయేంత నీటి సౌకర్యం కల్పిస్తాను..." అని చెప్పాను. మనసులో మాత్రం.."అన్ని సౌకర్యాలు ఊరికే కావాలంటే ఎలా వచ్చేస్తాయి?" అని అనుకున్నాను. అతని చేతిలో కొన్ని చాక్లెట్లు పెట్టి బయల్దేరాను.

★★★

కాస్త దూరం వెళ్ళాక, పి.ఎ.పై విరుచుకుపడ్డాను.

"ఏంటయ్యా ఇది, ప్రతీ సారి తప్పుదారిలో నడిపిస్తున్నావు..." అని కోపంగా అరిచాను.

"సార్. ఇటువైపు రావడం ఇదే నాకు మొదటిసారి. నాకు దారి తెలియదు. మీరు ఇక్కడే పుట్టి పెరిగారు కదా, దారి మీకు బాగా తెలిసే ఉంటుందని అనుకున్నాను. పైగా ఈ నియోజక వర్గం నుంచే మీరు ఎన్నికల్లో గెలిచారు.." అన్నాడు.

కాస్త సిగ్గుగా అనిపించింది. "సర్లే, ఏం పరవాలేదు. అదిగో అటు వైపు నడు. అలా వెడితే మా గ్రామం వస్తుంది..." అని గర్వంగా పి.ఎ.కి చెబుతూ నడక కొనసాగించాను.

గ్రామంలోకి ప్రవేశిస్తుండగా, "చూసావా.. ఇదే బంశ్‌ఘరీ గ్రామం" అన్నాను పి.ఎ.తో.

కాని నేను పప్పులో కాలేసాను. అది బంశ్‌ఘరీ గ్రామం కాదు. దండూగావ్ అనే ఊరు.

ఓ మంత్రిగా ఉంటే ఎదురయ్యే సమస్యలేంటో నాకు బాగా అర్థమయ్యాయి. తన సొంత గ్రామానికి దారి ఎటో ఎవరిని అడగలేడు మంత్రి. మళ్ళీ ఈ సారి వచ్చినప్పుడు మాప్ తెచ్చుకోవాలని నిర్ణయించుకున్నాను. నా పి.ఎ.కి ఈ ఆలోచన చెప్పాను. అద్భుతమైన ఆలోచన అంటూ మెచ్చుకోలుగా తలూపాడు. మేము నడుస్తూనే ఉన్నాం కానీ చేరాల్సిన ఊరు మాత్రం చేరడం లేదు. మాప్ తెచ్చుకోవాలనే ఆలోచన ఎంత ప్రసక్తమైనదో, ఎంత అవసరమో నాకు బాగా అర్థమైంది.

★★★

ఇంకో ఊర్లో ప్రవేశించాం. రచ్చబండ దగ్గర కొంతమంది జనాలున్నారు.

"1990లలో ప్రజాస్వామ్య ఉద్యమాన్ని మీరు ఈ ఊరినుంచే మొదలుపెట్టారు..." చెప్పాడో వృద్ధుడు. ఈ సమాచారం ఏమార్చేలా ఉంది.

"అవును కదూ.." అన్నాను. నిజానికి ఇవన్నీ నేనెప్పుడో మరిచిపోయాను. కానీ కాదని తోసిపుచ్చలేను. నా సమస్య మరీ తీవ్రమైంది. ఇది కూడా మా ఊరు కాదు. గుడ్డిలో మెల్ల ఏంటంటే ఇవన్నీ నా నియోజక వర్గంలోని గ్రామాలే.

"కాగితం కలమూ తీసుకో..." అంటూ పి.ఎ.ని ఆదేశించాను.

మేము తిరిగిన గ్రామాల పేర్లు వ్రాయించాను.

"ఓహ్.. మంత్రిగారు... ఇన్ని గ్రామాలలో పాదయాత్ర చేసారు... ఇది అద్భుతమైన వార్త అవుతుంది సర్..." చెప్పాడు పి.ఎ. ఉత్సాహంగా.

ఇదీ నా దూరదృష్టి.

నడుస్తున్న కొద్దీ రోడ్డు విశాలం అవుతోంది. అమ్మయ్య ఎట్టకేలకు మా గ్రామానికి చేరుతున్నామని అనుకున్నాను. కాని ఇప్పుడు కూడా నా అంచనా తప్పింది. వేరే గ్రామంలో ప్రవేశించాం.

"అరవై వేలు నొక్కేసారు..." అంటూ లోలోపల ధర్మాపూర్ గ్రామస్తులని తిట్టుకున్నాను. "ఈ ఏడాది బడ్జెట్‌లో ఈ గ్రామానికి ఒక్క రూపాయి కూడా రాకుండా చూస్తాను..." అని మనసులో శపథం చేసుకున్నాను.

★★★

భగభగా మండుతున్న భానుడి ప్రతాపం నాకు ఎయిర్ కండీషనర్‌ని గుర్తు చేసింది. నా వాహనం పజేరోని జ్ఞాపకం చేసుకున్నాను. సెక్రటేరియట్‌లో నా ఛాంబర్‌ని తలచుకున్నాను.

ఉన్నట్లుండి నాలో బెంగ మొదలైంది. నేను లేని సమయంలో – సహాయ మంత్రి – ఉన్న ఉద్యోగాలను తన వాళ్ళతో నింపేసుకుంటాడేమో! మొత్తం కమీషన్లన్నీ అతనికే పోతే?

అమ్మో!

"గ్రామం ముఖ్యమా? దేశం ముఖ్యమా?" అని అడిగాను పి.ఎ.ని.

"నిస్సందేహంగా దేశమే సర.." అన్నాడు పి.ఎ. భావోద్వేగంతో.

"అయితే, రాజధానికి పోదాం పద"

"అలాగే అయ్యా. ఓ గ్రామం కోసం వెతికి సమయం వృధా చేసుకునే కన్నా, ప్రజాసేవ చేయడం కోసం రాజధానికి మళ్ళడమే మంచిది.."

మేము రాజధానికి వెళ్ళే రోడ్డు వైపు తిరిగాం.

దారిలో ఓ చోట మరికొందరు పిల్లలు కనబడ్డారు. జేబులో ఉన్న చాకెట్లు వారికి ఇచ్చాను.

గ్రామం పొలిమేరల్లోకి వచ్చాం. జేబులోని తాయిలాలు అయిపోయాయి.

నేపాలీ మూలం: నయన్‌రాజ్ పాండే, ఆంగ్లం: వీణా పున్

తెలుగు: కొల్లూరి సోమ శంకర్

ఒక్క ఏడాదిలో ఎన్ని సినిమాలు చూశారు?

⋆ మీరే కాదు పిల్లలకు కూడా ఈ సూచన చేయొచ్చు. ఒక సంవత్సర కాలంలో ఎన్ని సినిమాలు చూశారో డైరీలో రాయమని చెప్పండి. థియేటర్‌కు వెళ్ళి చూసిన సినిమాలు ఎన్ని? ఇంట్లో కంప్యూటర్‌లో చూసిన సినిమాలు ఎన్ని? ఈ రెండిటి జాబితాను రాయాల్సిందిగా చెప్పండి... ఎంత సమయం సినిమాలు చూడటంలో గడిపారో తెలిసిపోతుంది.

⋆ అమ్మానాన్నలతో కలిసి చూసిన తొలిసినిమా

⋆ ఫ్రెండ్స్‌తో కలిసి చూసిన తొలిసినిమా

⋆ మొదటిసారి స్కూల్ టూరు, కాలేజీ టూరు ఎప్పుడు ఎక్కడికి వెళ్ళారు?

ఈ జ్ఞాపకాలు తర్వాతి రోజుల్లో తమకు ఇష్టమైన భాగస్వామితో కలిసి పంచుకోడానికి గుర్తుగా ఉంటాయి.

■ **సృజన**

తెలంగాణ విజ్ఞాన భాండాగారాలు

గ్రంథాలయం అంటే పుస్తక భాండాగారమే కాదు విజ్ఞాన భాండగారం కూడా. అజ్ఞాన తిమిరాన్ని తొలగించి జ్ఞాన జ్యోతులు వెలిగించే దివ్వెలు గ్రంథాలయాలు. "అక్షర రూపం దాల్చిన ఒక సిరాచుక్క లక్ష మెదళ్లను కదిలిస్తుంది" అన్నాడు కాళోజీ. భాషాభిమానులు, విద్యా ప్రియులు అయిన ప్రభువులు, జమీందారులు, విద్వాంసులు గ్రంథాలయాల స్థాపనకు దోహదం చేశారు. తంజావూరు నాయకరాజుల సాహిత్యాభిమానానికి నిదర్శనమే వారు నెలకొల్పిన 'సరస్వతీ మహలు' గ్రంథ నిలయం.

నిజాం ప్రభుత్వ కాలంలో జాతీయోద్యమానికి, ఆంధ్రోద్యమానికి ప్రేరణగా నిలచింది గ్రంథాలయోద్యమమే అంటే అత్యుక్తి కాదు. తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణ ధ్యేయంగా రావిచెట్టు రంగారావు, నాయని వెంకట రంగారావు, కొమర్రాజు లక్ష్మణరావు మొదలైన మహానీయులు 1901 సెప్టెంబర్‌లో హైదరాబాద్ సుల్తాన్ బజారులో స్థాపించిన 'శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషా నిలయం' సారస్వత, సాంస్కృతిక మహావృక్షమై నూటపద్నాలుగు సంవత్సరాలుగా వెలుగొందుతున్నది.

1891లో ఆసఫ్‌జాహీల పేరిట మౌల్వీ సయ్యద్ హుస్సేన్ చిల్‌గ్రామీ హైదరాబాద్ ఆబిడ్స్ రోడ్డులో నెలకొల్పిన 'ఆసఫియా లైబ్రరీ' తెలంగాణ చరిత్రలో విస్మరించరాని ఘట్టం. అదే నేడు అఫ్జల్‌గంజ్‌లో సుప్రసిద్ధమైన 'స్టేట్ లైబ్రరీ'గా రూపొందింది. 1932లో నిజాం రాజు మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ శంకుస్థాపన చేయగా, ఇండో యూరోపియన్ శైలిలో నిర్మితమైన ఈ మహా భవనం 1936లో ప్రారంభమైంది.

అయితే అంతకు పది సంవత్సరాల ముందే 1891లో ఆసఫ్‌జాహీల పేరిట మౌల్వీ సయ్యద్ హుస్సేన్ చిల్‌గ్రామీ హైదరాబాద్ ఆబిడ్స్ రోడ్డులో నెలకొల్పిన 'ఆసఫియా లైబ్రరీ' తెలంగాణ చరిత్రలో విస్మరించరాని ఘట్టం. అదే నేడు అఫ్జల్‌గంజ్‌లో సుప్రసిద్ధమైన 'స్టేట్ లైబ్రరీ'గా రూపొందింది. 1932లో నిజాం రాజు మీర్ ఉస్మాన్ ఆలీఖాన్ శంకుస్థాపన చేయగా, ఇండో యూరోపియన్ శైలిలో నిర్మితమైన ఈ మహా భవనం 1936లో ప్రారంభమైంది. స్వాతంత్ర్య సిద్ధి తర్వాత (1947) 'స్టేట్ సెంట్రల్ లైబ్రరీ' పేరుతో వ్యవహరించ బడుతున్న ఈ కేంద్రంలోనే పబ్లిక్ లైబ్రరీ డైరెక్టర్ కార్యాలయం ఏర్పాటైంది. హైదరాబాద్ రాష్ట్రం ఏర్పాటు తర్వాత 1955 నుంచి హైదరాబాద్ లైబ్రరీ చట్టం అమలోకి వచ్చింది.

శ్రీకృష్ణ దేవరాయ భాషానిలయం స్థాపన తర్వాత తెలంగాణాలో గ్రంథాలయోద్యమం ఉధృతమై వివిధ జిల్లాల్లో ఊరూరా గ్రంథాలయాలు వెలసినాయి. 1903-1926 మధ్య ఇరవై మూడు సంవత్సరాల కాలంలోనే సికింద్రాబాదు (ఆంధ్ర సంవర్ధని), హనుమకొండ (శ్రీరాజరాజ నరేంద్ర భాషానిలయము), వరంగల్ (శబ్దాను శాసనాంధ్ర గ్రంథాలయం), నల్లగొండ (నీలగిరి గ్రంథాలయం), గద్వాల (చెన్న కేశవ గ్రంథాలయం) మొదలగు అన్ని జిల్లాల ప్రాంతాల్లో 63 గ్రంథాలయాలు నెలకొన్నాయి. 1921లో ఆంధ్ర జన సంఘ స్థాపన తర్వాత గ్రంథాలయ మహాసభలు కూడా ఘనంగా కొనసాగినాయి. ఆంధ్ర జన కేంద్ర సంఘం మూడవ సమావేశం సందర్భంలో ఖమ్మం జిల్లా మధిరలో 22-2-1925 నాడు మొదటి గ్రంథాలయ మహాసభ జరిగింది. 1926లో కలిగిన ప్రతిబంధకాల కారణంగా 1929 మే 31, జూన్1 తేదీలలో సూర్యాపేటలో రెండవ మహాసభలు జరిగినాయి. 29 గ్రంథాలయాల ప్రతినిధులు ఈ సభల్లో పాల్గొన్నారు.

నాటి గ్రంథాలయోద్యమంలో సురవరం ప్రతాపరెడ్డి, కొత్వాల్ వెంకట రామారెడ్డి నిర్వహించిన పాత్ర ఆగ్రగణ్యమైనది. గ్రంథాలయాల ఆవశ్యకత గురించి గోలకొండ పత్రికలో వ్యాసాలు రచించిన సురవరం 'గ్రంథాలయోద్యమము' అన్న ప్రత్యేక గ్రంథాన్ని (1940) ప్రకటించారు. 1942 మే 28న తెనాలి తాలూకా పెదపాలెంలో జరిగిన ఆంధ్ర దేశ గ్రంథాలయ 23వ మహాసభకు ఆయన్ను ఆహ్వానించటమే కాక గ్రంథాలయ సంఘానికి ఉపాధ్యక్షునిగా ఎన్నుకొన్నారు. తర్వాత జరిగిన ఆంధ్రదేశ గ్రంథాలయ మహాసభలు ప్రతాపరెడ్డి గారి నిర్వహణలో తెలంగాణలోనే ఏర్పాటైనాయి. 1944 ఆగస్టులో జరిగిన 25వ మహాసభకు ఆయన ప్రారంభకులుగా ఉన్నారు. పాలమూరు జిల్లా క్యాతూరులో జరిగిన 26వ మహాసభకు (1946) రాజాబహద్దురు అధ్యక్షత వహించగా, ఆంధ్ర పితామహ మాడపాటి హనుమంతరావు సభను ప్రారంభించారు. 27వ మహాసభలు సూర్యాపేటలో (7 ఏప్రిల్, 1948) కొనసాగినాయి. 'గ్రంథాలయ సర్వస్వము' సంపాదక వర్గ సభ్యులుగా కూడ (1948) సురవరం వారు నియమితులైనారంటే గ్రంథాలయోద్యమంలో ఆయన పాత్ర ప్రకాశిత మవుతుంది. ఆంధ్ర ప్రాంత ఉద్యమ నిర్మాతలు గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యంకి వెంకట రమణయ్యలకు ఎంతో సహకారం అందించారు.

నిజాం ప్రభుత్వంలో కొత్వాల్ (పోలీస్ కమిషనర్)గా పనిచేసిన రాజ బహద్దుర్ వెంకట రామారెడ్డి హైదరాబాద్‌లో నెలకొన్న పలు విద్యా సాంఘిక, సాహిత్య సంస్థలకు అధ్యక్షుడుగా, కార్యదర్శిగా, హితవరిగా

ప్రజాహిత కార్యక్రమాల్లో కీలక పాత్ర వహించాడు. నాంపల్లిలోని వేమన ఆంధ్రభాషా నిలయం, గౌలిగూడలోని బాలసరస్వతీ గ్రంథాలయం మొదలైనవి ఆయన పోషణలో వర్ధిల్లినాయి. శ్రీకృష్ణ దేవరాయాంధ్ర భాషానిలయం అధ్యక్షులుగా దశాబ్దం పాటు (1940-50) బాధ్యతలు నిర్వహించారు. 1943లో స్థాపితమైన ఆంధ్ర సారస్వత పరిషత్తు తెలుగుభాషా పరీక్షల ద్వారా ఇంటింటా అక్షర జ్యోతిని వెలిగించటమే కాక, అసంఖ్యకమైన గ్రంథాలను సేకరించి బృహత్

పరిశోధనాలయాన్ని కూడా సొంతం చేసుకుంది. విశాలాంధ్ర ఏర్పాటు తర్వాత కోదాటి నారాయణరావు, దేవులపల్లి రామానుజరావు ప్రభృతులు నగర కేంద్ర గ్రంథాలయం (చిక్కడపల్లి సిటీ సెంట్రల్ లైబ్రరీ) అభివృద్ధికి ఎంతో పాటు పడ్డారు. రంగారెడ్డి జిల్లా సాయిరెడ్డి పల్లెకు చెందిన పాండురంగారెడ్డి కార్యదర్శిగా దానికి విశాల భవనం సమకూర్చటంలో కృషిసల్పాడు.

నిజాం నవాబుల నిర్మాణ శిల్ప వైభవానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలతో పాటు ప్రత్యేక లైబ్రరీ భవనం ప్రతీకలుగా నిలుస్తాయి. నేను ఎం.ఎ విద్యార్థిగా ఉన్నపుడు 1963 ఆగస్టు 3వ తేదీన అప్పటి భారత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ఈ భవనాన్ని ప్రారంభించారు. హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు 1956లో దీనికి శంకుస్థాపన చేశారు. వ్రాతప్రతులు, తాళపత్ర ప్రతులతో పాటు పెక్కు జాతీయ, అంతర్జాతీయ భాషా గ్రంథాలు ఇందులో చోటు చేసుకొన్నాయి.

నేను కాలేజీ విద్యార్థిగా హైదరాబాద్ నగరంలో అడుగు పెట్టినపుడు (1956-57) రోజంతా అఫ్జల్‌గంజ్ స్టేట్ లైబ్రరీ, గౌలిగూడ బాల సరస్వతీ గ్రంథాలయాల్లోనే గడిపేవాడిని. 1964-71 మధ్య 'తెలుగులో సాహిత్య విమర్శ' అంశంపై డాక్టరేట్ పరిశోధన చేస్తున్న కాలంలో మద్రాసు, ఆంధ్ర ప్రాంతాలతో పాటు హైదరాబాద్ నగర గ్రంథాలయాలు నాకు ఎంతగానో ఉపకరించాయి "పుస్తకాన్ని మించిన ఆప్తమిత్రుడు లేడు" అన్న బుచ్చిబాబు మాటలు నేను ఎప్పుడూ గుర్తు చేసుకొంటాను.

"మంచి పుస్తకం నీడన
మనసెంతో చల్లన"
(బాపురమణలు)

- ఆచార్య ఎస్వీ రామారావు, 98480 12053

స్ఫూర్తినిచ్చిన గురువు ■

మా మంచి గురువు

నా పేరు మామిడాల బాలకృష్ణ. నేను వరంగల్ జిల్లా గణపురం మండలంలోని మైలారం ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాను. ఏడవ తరగతి కర్కపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో చదివాను. అక్కడ తెలుగు పాఠాలను చెప్పే సతీష్‌రెడ్డి మాష్టారంటే నాకు చాలా ఇష్టం. ఆయన తెలుగు పద్యాలను, గేయాలను రాగయుక్తంగా పాడి వినిపించేవారు. నేను కూడా పద్యాలు పాడటానికి ఆయన్ని అనుకరించేవాడిని. శరీర శుభ్రత ఎంత అవసరమో అంతే క్లాసు రూముల్ని శుభ్రంగా వుంచుకోవాలని మాతో ఎప్పుడూ చెప్పేవారు. అంతే కాకుండా స్కూల్లో చెట్లను నాటించేవారు. సాయంత్రం పూట యోగా, వ్యాయామం నేర్పేవారు. ఒక్క మాటలో చెప్పాలంటే క్రమశిక్షణకు మారు పేరు మా సతీష్‌రెడ్డి సార్. అనేక సమస్యలపై దిన పత్రికలకు ఉత్తరాలు రాస్తూ, సమాజాన్ని చైతన్యపరిచేవారు. మండల స్థాయి క్విజ్, ఆటలు, ప్రతిభా పాటవాల పోటీలకు మమ్మల్ని తీసుకెళ్లేవారు. వారి శిక్షణలో మేం ఎన్నో బహుమతులు గెల్చుకున్నాం కూడా. ఆయన ఇప్పటి వరకు 42 సార్లు రక్తదానం చేసి జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఎన్నో అవార్డులను అందుకున్నారు. ఆయన్ని చూసిన తర్వాత నేను కూడా ఆయనలాగా ఉపాధ్యాయవృత్తిలో ఉండి విద్యార్థులకు మంచి విద్యను అందించాలని ఉంది.

- మామిడాల బాలకృష్ణ, కర్కపల్లి, గణపురం, వరంగల్

స్ఫూర్తి నిచ్చిన ఉపాధ్యాయులు



నా పేరు ఆయనం రఘురామారావు. నేను భద్రాచలం కొర్రాజులగుట్ట పాఠశాలలో ఏడవ తరగతి చదివే రోజుల్లో అప్పటి ఉపాధ్యాయుడైన ప్రకాష్ కుమార్ చదువు విషయంలో అండగా నిలిచి, వెన్ను తట్టి ప్రోత్సహించారు. మా నాన్నగారి ఉద్యోగ రీత్యా వివిధ ప్రాంతాల్లో తిరగడం వల్ల చదువులో వెనుకబడ్డాను. ముఖ్యంగా గణిత శాస్త్రంలో. స్కూల్లో క్లాసులు అయిపోగానే ప్రకాష్ కుమార్ మాస్టారు దగ్గర ప్రవేటుకి వెళ్లేవాడిని. గణితంలో వెనుకబడిన నాకు పూర్తిస్థాయిలో తర్ఫీదు ఇచ్చి ఏడవ తరగతి పాసవ్వడానికి కారణమయ్యారు. పదో తరగతికి మా నాన్నగారికి ఖమ్మం బదిలీ అయింది. అక్కడ మరో ఉపాధ్యాయులు దొడ్డ సత్యనారాయణ మాస్టారు నా బ్రతుకు బాటకు పునాది వేశారు. లెక్కలు, ఇంగ్లీషు సబ్జెక్టుల్లో వెనుక బడిన నేను నేడు ఉన్నత పదవులు పొందగలిగానంటే అందుకు కారణం ప్రకాష్‌కుమార్, దొడ్డ సత్యనారాయణ మాస్టార్లే. పునాదులు గట్టిగా ఉంటేనే విద్యలో ముందుకు సాగేది. నా విషయంలో అటువంటి పునాదిని వేసింది వారిద్దరే. వారు అందించిన సహకారం నా భవిష్యత్తుకు నాంది పలికింది. నాకే కాదు మరెందరికో మార్గ దర్శకులుగా నిలిచిన వారు అభినందనీయులు, పూజనీయులు.

- ఆయనం రఘురాం, కవిరాజనగర్, ఖమ్మం

నెమలీక

రామలింగడి తెలివి

తెనాలి రామలింగయ్య కృష్ణదేవరాయల కొలువులో చేరిన కొత్తలో జరిగిన సంఘటన. లంచం ఇవ్వకపోతే రాజుగారి సభా భవనం ముందు ఉండే ద్వారాపాలకులు ఎవ్వరినీ రాయలు వారి దర్శనానికి అనుమతిచ్చేవారు కాదు. ఈ విషయం రామలింగడికి తెలిసింది. అసలు తను విన్నది నిజమో కాదో తెలుసుకోడానికి ఓ రోజు మారువేషంలో సభా మండపం దగ్గరికి వెళ్లి లోపలికి పంపించమని ద్వార పాలకులను అడిగాడు రామలింగడు. కానీ వాళ్లు రామలింగడ్ని రాయలు దర్శనానికి వెళ్లనివ్వలేదు.

'రాజుగారే బహుమతి తీసుకోడానికి రమ్మని పిలిచారు' అని అబద్ధం చెప్పా రామలింగడు. వెంటనే ద్వారపాలకులు లోపలికి పంపించడానికి అనుమతిచ్చారు కానీ రాజుగారు ఇచ్చే బహుమతిలో సగం తమకి ఇవ్వాలని షరతు పెట్టారు. అందుకు సరేనన్నాడు రామలింగడు. మరో ద్వారం దగ్గర ఉన్న ద్వార పాలకులు కూడా రామలింగడ్ని అడ్డుకున్నారు. బహుమతి ఇవ్వడానికి రాజుగారే రమ్మని పిలిచారని చెప్పాడు రామలింగడు. అయితే తమకేంటి లాభమని చేయి చాచారు భటులు. రామలింగడు తనకిచ్చే బహుమతిలో సగం వాటా ఇస్తానంటే లోపలికి పంపించారు.

లోపలికి వెళ్లిన రామలింగడికి రాయలువారి ముందు నాట్య ప్రదర్శన చేస్తూ నాట్యకత్తెలు కనిపించారు. వెంటనే వారిని కట్టె తీసుకుని కొట్టడం మొదలుపెట్టాడు రామలింగడు.

ఈ దృశ్యం చూసిన రాయలవారికి కోపం వచ్చి, రామలింగడికి వంద కొరడాదెబ్బల శిక్ష వేయమని భటులను ఆదేశించారు.

వెంటనే రామలింగడు రాయల వారితో 'ఆగండి కృష్ణదేవరాయా! ఇందులో సగం వాటా తీసుకోడానికి నలుగురు మిత్రులున్నారు' అంటూ జరిగిన విషయం మొత్తం చెప్పాడు.

రాయలు ఆ నలుగురు ద్వారపాలకులను పిలిచి 'రాయల పాలనలో, అది కూడా నా సభా మండపం ముందే లంచం అడిగే ధైర్యమా?'అని వారిని కోప్పడి నలుగురికీ యాభై కొరడా దెబ్బలు శిక్ష విధించారు కృష్ణదేవరాయలు. ఇంటి దొంగల్ని పట్టిచ్చినందుకు రామలింగడికి వంద బంగారు నాణేల్ని బహుమతిగా ఇచ్చారు.

జత చేయండి



ఎడమ వైపు ఉన్నవాటికి సంబంధించిన వస్తువులే కుడి వైపు ఉన్నాయి. వాటిని జత చేయండి.



జవాబు : 1-సి, 2-డి, 3-ఎ, 4-ఎఫ్, 5-బి, 6-ఇ

రంగులతో నింపేద్దాం

అమ్మాయిలు బాగున్నారు కదా! వీరు మరింత అందంగా కనిపించాలంటే రంగులతో నింపితే సరి!

త్రిభుజాలెన్ని?

ఈ చతురస్రంలో ఎన్ని త్రిభుజాలున్నాయి?



జవాబు : 92

చుక్కలు కలిపేద్దాం



తేడా ఏది?

ప్రతి వరుసలో ఒకేలా కనిపించే మూడు బొమ్మలున్నాయి. వాటిలో ఒకటి మిగతా రెండింటితో కలవదు. అది ఏదో చెప్పగలరా?

జవాబు : 2, బి, ఎ

కనిపించాయా?

రోజీ భలేగా గుర్రపు స్వారీ చేస్తోంది కదూ! ఈమె గుర్రపు స్వారీని ఐదు పక్షులు గమనిస్తున్నాయి. అవి ఎక్కడున్నాయో కనిపించాయా.



తేడాలు కనిపెట్టండి

ఈ రెండు బొమ్మలు చూడ్డానికి ఒకేలా కనిపించినా వాటిల్లో 10 తేడాలున్నాయి. అవి ఎక్కడెక్కడ ఉన్నాయో గుర్తించండి.

దారి చెప్తారా...

బంటికి ఈ కొండ మధ్యలో ఉన్న పీక కావాలంట. అక్కడికి వెళ్లడానికి దారి చూపిస్తారా?



■ సీరియల్

ప్రేమ - విప్లవం

మూలం : మేరీ గాబ్రియేల్

స్వేచ్ఛానువాదం: ముక్తవరం పార్థసారథి, ఫోన్: 91776 18708

(గతవారం తరువాయి)

తన పారిస్ నోట్‌బుక్స్‌లో 'కూలీ, అద్దె, పరపతి (credit) లాభం, ప్రైవేటు ఆస్తి, Vs . కమ్యూనిజం గురించీ, 'పెట్టుబడికీ, శ్రమకూ వున్న సంబంధం గురించీ రాశాడు మార్క్స్. హెగెల్‌ను పున్ణపరిశీలించాడు. ప్రస్తుత ఆర్థిక వ్యవస్థకు పరమావధి డబ్బు సంపాదన (డబ్బుతో కొనగలిగే వస్తువులు). మానవ జీవిత లక్ష్యం 'డబ్బు' కావటం వల్ల, అతడికి ఇతర మనుషులతో వున్న సంబంధాలన్నీ వక్రీకరించబడ్డాయి. అంటే జీవితానికి, మానవ సంబంధాలకు అర్థమే మారిపోయింది. డబ్బే అందరి లక్ష్యం గనుక, ధనికుడు ఇష్టారాజ్యంగా బతకవచ్చు. ఆ పుస్తకంలోని ఒక పేరా:

'నేను కురూపిని. కాని నేను ధనికుణ్ణి గనుక ప్రపంచంలోని సుందరీమణులందర్నీ డబ్బుతో కొనగలను. అంటే డబ్బుంటే నేను కురూపినీ కాను. దానివల్ల నా అవలక్షణాన్ని, లోపాన్ని అధిగమించాను. నేను దుర్మార్గుణ్ణి. నీతి, నిజాయితీ లేనివాణ్ణి. మూర్ఖుణ్ణి. కాని డబ్బుంటే నా అంత నిజాయితీపరుడు, సజ్జనుడు మరొకడు లేడంటారు. నాకు తెలివితేటలు లేవు. కాని డబ్బే నా తెలివితేటలు. పైగా, నాకు స్వయంగా తెలివితేటలు లేకపోతేనేం, అవి వున్నవాళ్లను డబ్బుతో కొనగలను. నా లోపాలన్నింటినీ కప్పేస్తుంది డబ్బు.'

మానవ సంబంధాలలో ఇంత వైషమ్యం ఎందుకేర్పడిందో హేతుబద్ధంగా విశ్లేషించాలనుకున్నాడు మార్క్స్. డబ్బు ఉత్పత్తి మీద పూర్తి నియంత్రణ వున్న పెట్టుబడిదారు తాను నిర్ణయించిన కూలీకి పని చెయ్యమనటం ద్వారా కార్మికుడిని dehumanize చేస్తున్నాడు. ఇదెలా ఉందంటే, ఒకడి దగ్గర బస్తాడు ధాన్యం ఉంది. కాని దాన్ని, తను నిర్ణయించిన ధరకు కాకుండా, కొనుగోలు చేసేవాడు అడిగిన ధరకు అమ్మినట్టుగా ఉంది. అమ్మకందారుకు తను అమ్మదలచుకున్న వస్తువుల ధరను నిర్ణయించే అధికారం లేదు. కొత్త పారిశ్రామిక సంబంధాలలో కార్మికుడికి తన శ్రామిక విలువ నిర్ణయించుకునే అవకాశం లేదు. ఫలితంగా, కార్మికుడు పరాయీకరణ చెందుతున్నాడు. ఒక నిర్జీవమైన వస్తువుగా మారిపోతున్నాడు. తన శ్రమ ఫలితం పెట్టుబడిదారుడు, ఫ్యాక్టరీ యజమానికి లాభాలార్జిస్తున్నది. కాని తనను మాత్రం అర్థాకలితో రోజులు గడపమంటున్నది.

కనిపిస్తున్న సమాజమే తన సిద్ధాంతానికి సజీవసాక్ష్యం. పొట్టచేత పట్టుకొని గుంపులు గుంపులుగా నగరాలకు తరలివస్తున్నారు జనం. కాని అక్కడి పరిశ్రమల్లో ఫ్రెంచివాళ్లకే పేరు పెట్టారు. అదే పాపరిజం- pauperism -శ్రమజీవి ముష్టివాడిగా మారటం.

గత ఇరవై ఏళ్లుగా, జీవన వ్యయం 17 శాతం పెరిగినప్పటికీ, వేతనాలు క్రమంగా తగ్గాయి. 1844లో ఆహార కొరత ఏర్పడింది. కాని సంపన్నులు మాత్రం పంచభక్ష్య పరమాన్నాలతో విందు లారగించారు. దేశ సంపద అంతా కొద్దిమంది చేతుల్లో కేంద్రీకృతం కావటానికి ప్రభుత్వ విధానాలే కారణమని ప్రచారం జరిగింది. తను చదివిన ఆర్థిక శాస్త్రవేత్తల గ్రంథాలలో 'స్వేచ్ఛా విపణి సమాజ శ్రేయస్సుకు దోహదం చేస్తుంది. అన్ని వర్గాల ప్రజలూ లాభపడతారు' అని రాశారు. కాని విపణిని సంపన్నులు తమ స్వలాభం కోసమే వాడుకుంటున్నారన్న చేదు నిజాన్ని మార్క్స్ కళ్లారా చూశాడు.

రెండేళ్ల క్రితమే కొలోన్‌లో కమ్యూనిజం అనేది ఎప్పుడూ సాకారం కాలేని కల అని భావించిన మార్క్స్, సమాజ పునర్నిర్మాణానికి అది తప్ప గత్యంతరం లేదనే నిర్ధారణకు వచ్చాడు. మనుషులు సంపద సృష్టించాల్సిందే. కాని అది ప్రైవేట్ ఆస్తిగా మారకూడదు. మనుషులు శ్రమించాలి. కాని అది వాళ్లకూ, సమాజ హితానికే ఉపయోగపడాలి. యజమాని సొంత ఆస్తిగా రూపాంతరం చెందకూడదు. 'మనిషికీ ప్రకృతికీ మధ్య, మనిషికీ మనిషికీ మధ్య వున్న వైషమ్యాలను తొలగించే ఏకైక వ్యవస్థ కమ్యూనిజం' అని వివరించాడు. 'కమ్యూనిజంలో కళలు, సౌందర్య భావనలు అంతరిస్తాయని సందేహించాడు హైన్. కాని 'అందరికీ ఆకలి తీర్చుకునే హక్కుందని అంగీకరిస్తే, ఆ వాదన వల్ల హేతుబద్ధంగా వచ్చే పరిణామాలను కాదనలేం గదా!' అని కూడా అన్నాడు.

తమను తాము కమ్యూనిస్టులుగా భావించిన ఫ్రెంచి, జర్మన్ కార్మికులు (పారిస్‌లో వుంటున్న వారంతా) అవినీతిమయమైన ఈ ఆర్థిక వ్యవస్థను కూలదోయటానికి విప్లవం తప్ప మరో మార్గం లేదని నమ్మారు. వ్యవస్థ మారటం వల్ల నష్టపోయే సంపన్నులతో, పెట్టుబడిదారులతో (బూర్జువాలతో) చర్చలు జరపటం వల్ల ప్రయోజనం లేదు. ఈ పారిశ్రామిక భూస్వామ్య విధానం (ఈ నూతన ఆర్థిక వ్యవస్థకు కొందరు పెట్టిన పేరది.) కూడా, పాత భూస్వామ్య విధానంలాగా అంతం కావాలంటే హింస అనివార్యం. 'సొంత ఆస్తి అనే భావనను అంతమొందించడానికి కమ్యూనిజం అనే భావన చాలు. కాని నిజమైన వాస్తవమైన సొంత ఆస్తిని అంతమొందించటానికి కమ్యూనిస్టు చర్యను వాస్తవ రూపంలో అమలు చెయ్యాలి అని రాశాడు మార్క్స్. సరిగ్గా, ఆ సమయంలోనే, మార్క్స్ అభిప్రాయాలను పసిగట్టినట్టుగా, పారిస్‌లో హింస చెలరేగింది. ప్రష్యాలోని సిలేసియా ప్రాంతంలో కూడా తిరుగుబాట్లు జరిగినట్టుగా వార్తలొచ్చాయి. మార్క్స్‌కూ, పారిస్‌లోని కార్మికులకూ ఇంతకన్నా కావలసిందేమిటి!

తమ దుర్భర పరిస్థితులను సహించలేని నేత కార్మికులు కొందరు, కోపోద్రిక్తులై, ఇద్దరు పారిశ్రామికవేత్తలైన సోదరుల మీద దాడి చేశారు. 'దుర్మార్గులారా, మా నెత్తురు పీలుస్తున్న జలగల్లారా, మమ్మల్ని కబళిస్తున్న కొండచిలువల్లారా, మీరు మాకెట్లాగూ జీతాలివ్వరు. ఇదే మేమిచ్చేది" తీసుకోండి. అన్నది వాళ్ల నినాదం. అనేక రోజులుగా తిండి లేని ఆ కార్మికుల దాడిలో (పారిశ్రామికవేత్తల) ఇల్లు ధ్వంసమైంది. కాని వాళ్లు తప్పించుకున్నారు. ఆ మరుసటి రోజు, అయిదు వేలమంది నేత కార్మికులు తిరుగుబాటు చేశారు. తమ యజమానుల ఇళ్లలోకి ఫ్యాక్టరీల్లోకి ప్రవేశించి, యంత్రాలను ధ్వంసం చేశారు. లూటీకి పాల్పడ్డారు. యజమానుల రక్షణకు వచ్చిన ప్రష్యన్ సైన్యం తిరుగుబాటు

దార్లమీద జరిపిన కాల్పుల్లో ముప్పై అయిదు మంది మరణించారు. రాళ్లూ, గొడ్డళ్లూ పట్టుకుని ఎదురుదాడి చేసింది కార్మికుల సైన్యం. కాని తెల్లారేసరికి అదనపు బలగాలొచ్చాయి. కార్మికులు పలాయనం చిత్తగించక తప్పలేదు. పారిపోలేని వాళ్లను అరెస్టు చేశారు.

జర్మనీలోని కార్మికులు చేసిన తిరుగుబాట్లకు నాంది పలికింది నేత కార్మికులే. అప్పటికిది విఫలమైనప్పటికీ, కార్మికవర్గానికీ, ఆర్థిక సమస్యకూ, రాజ్యవ్యవస్థకూ ఉన్న సంబంధాన్ని గుర్తించాడు మార్క్స్. గతంలో లాగ, ఈ తిరుగుబాటును ప్రేరేపించింది మతము, జాతి సమస్య లేదా రాజ్యకాంక్ష లాంటి ఊహాజనిత భావనలు కావు. స్పష్టమైన, భౌతికమైన 'ఆకలి' సమస్య దీనికి మూలం. నేత కార్మికులు తన శత్రువును కూడా సరిగ్గానే ఎంచుకున్నారు. అదే భవిష్యత్తులో మరింత బలపడపోతున్న బూర్జువావర్గం. డబ్బు వీళ్ల దగ్గర వుంది గనక ప్రభుత్వ పగ్గాలు కూడా వీళ్ల చేతుల్లోనే ఉంటాయి. ఫ్రాన్సులో ఇలాగే జరిగింది. ప్రష్యాలో కూడా అదే జరుగుతుంది.

తమ స్వదేశంలో జరిగిన పరిణామాలతో ఉత్తేజం పొంది, సుమారు రెండు వందల మంది జర్మన్లు (మార్క్స్, హెర్వీగ్, హైన్‌లతో సహా) ప్రతి ఆదివారం సమావేశాలు నిర్వహించారు. ఇలా గుమిగూడిన వాళ్లంతా రాజులను చంపటం ఎలా, ధనవంతులనూ, మతాధికారులనూ ఎలా అణచివేయాలి వంటి 'భయంకరమైన' విషయాలు చర్చించారని రిపోర్టు చేశారు ఫ్రెంచి పోలీసులు. ఉదారవాద రష్యన్లు బకూనిన్, ఇతర్లతో తరచూ చర్చలు జరిపి ఆర్థిక సహాయం అర్థించాడు మార్క్స్. 1844 జూలైలో వర్గ చైతన్యం పెంచుకున్న ఒక కార్మికుడు, మేధావి, అనార్కిస్టు పియేర్ జోసెఫ్ ప్రూధో (pierre - joseph proudhon)ను కలిశాడు మార్క్స్. అప్పటికే 'ఆస్తి అంటే ఏమిటి?' అనే పుస్తకం రాసి 'ఆస్తి అంటే దొంగ సొత్తే' అని తేల్చాడు ప్రూధో. కొత్త ఆలోచనా విధానానికి నాంది పలికిందీ పుస్తకం. సొంత ఆస్తి వల్ల కలిగే సామాజిక దుష్ఫలితాలను ఇంత వివరంగా తెలియజెప్పిన మొదటి వ్యక్తి ప్రూధో అన్నాడు మార్క్స్.

1844లో 'ఫార్వర్డ్' పత్రికకు మార్క్స్ రాసిన వ్యాసాలతో పోల్చితే, దేశ ద్రోహ నేరం మోపబడిన రూగ్ పత్రికలోని వ్యాసాలు బాల సాహిత్యం లాంటివనే చెప్పాలి. పారిస్ నుండి వెలువడిన, సెన్సార్ కాని జర్మన్ వారపత్రిక ఇదొక్కటే. నిజానికి ఈ పత్రికకు పెట్టుబడి పెట్టింది ఒక ప్రష్యన్ సంగీతకారుడు. హెర్వీగ్ ప్రియురాలు కౌంటెస్ డాగూల్డ్ అతడికి పారిస్‌లోని (జర్మన్) సోషలిస్టులు, కమ్యూనిస్టులందరినీ పరిచయం చేసింది. 'ఈ వెధవలంతా పత్రికలో రాయనీ. అలా, వాళ్లు తమ మరణశాసనం వాళ్లే రాసుకుంటున్నారు' అని కౌంటెస్‌కు చెప్పాడు ప్రష్యారాజు ఫ్రీడ్రిక్ విల్హెమ్.

ఈ పత్రికలోని ఒక ఎడిటోరియల్ అసిస్టెంట్, ప్రష్యన్ రాజు నుండి ఆర్థిక సహాయం పొందుతున్న ఒక జర్మన్ గూఢచారి బార్న్‌స్టెట్. మార్క్స్‌కు ఇతడి నేపథ్యం తెలిసే ఉంటుంది. అయినప్పటికీ పత్రికలో రాయటమే ముఖ్యమనుకుని వుంటాడు. ఏదేమైనా ఆరోజుల్లో ప్రభుత్వ వ్యతిరేక బృందాలలో గూఢచారులుండటం చాలా సామాన్యమైన విషయం.

ఈ పత్రికను స్థాపించిన హైన్రీష్ బెర్న్‌స్టైన్ ఇలా రాశాడు : 'సంపాదకీయ సమావేశాలకు పన్నెండు నుండి పద్నాలుగు మంది హాజరయ్యేవాళ్లు. అందరూ సిగార్లు కాలుస్తూనే ఉంటారు. గట్టిగా వాదించుకుంటారు. అరుచుకుంటారు. గదంతా పొగతో నిండిపోతుంది. కొత్తవాళ్లెవరైనా లోపలికి తొంగిచూసినా, ఆ పొగలో ఎవరెవరో పోల్చుకోవటం అసాధ్యం.' ఈ సమావేశాలకు మార్క్స్, హైన్, హెర్వీగ్, రూగ్, బకూనిన్, కవి జార్జి వీర్త్, మరో కమ్యూనిస్టు ఎవర్‌బెక్‌లు హాజరయ్యేవాళ్లు. రాసినందుకు ఎవరికీ ఏమీ పారితోషికం లభించేది కాదు.

ఈ కాలంలో మార్క్స్, జెన్నీకి రాసిన లేఖలు లభ్యం కావటం లేదుగాని, ఆమె రాసిన లేఖల ప్రకారం తను చాలా ఆందోళనలో గడిపింది. మార్క్స్ కార్యకలాపాల వల్ల పరపతి పెరిగింది. ట్రీయర్‌లో అందరూ అతడు బాగా సంపాదిస్తున్నాడనే అనుకున్నారు. తను కూడా హుందాగా, సంపన్నురాలిలాగా అందరి ముందూ ప్రవర్తించింది. కాని 'సక్సెస్ వేరు, సక్సెస్‌ఫుల్‌గా కనిపించటం వేరు' అంటుంది. కార్ల్‌కు ఉద్యోగం లేదు. ఎప్పుడు దొరుకుతుందో తెలియదు.

ప్రమాదకరమైన దారుల్లో మార్క్స్ ప్రయాణం కొనసాగినా, ధైర్యంగానే ఉండటానికి ప్రయత్నించింది జెన్నీ. దానికి కారణం కూతురు. ఇప్పుడామెకు ఇద్దరూ ముఖ్యమే. పారిస్‌లో కూతురు జబ్బు పడినప్పుడు ఎంత భయపడిందో! తమ ప్రేమకు సజీవ సాక్ష్యం జెన్నీచెన్. కనీసం కూతురు ఎదిగే వరకైనా తామిద్దరం క్షేమంగా ఉండగలిగితే!

మార్క్స్ గురించి వార్తలు చదివినప్పుడల్లా ప్రతి వాక్యానికీ భయంతో వణికిపోయింది. కాని అతడు ఎంచుకున్న మార్గం అనివార్యం. అదే సరైనది. అందువల్ల అన్ని పరిణామాలకూ సిద్ధపడాల్సిందే. కార్ల్ బాగా రాస్తాడు. అతడు 'కోపం, ఆక్షేపణ, ద్వేషం తగ్గించుకుని, సింపుల్‌గా ఉన్నదున్నట్టుగా, కాస్త హాస్యం మేళవించి, సులభంగా, సరళంగా రాయగలిగితే ఇంకా బాగుంటుంది' ఒకసారి, తనకు తానే సమాధానం చెప్పుకున్నట్టుగా' గాడిదలారా, మీరు ఇంకా గట్టినేల మీద నిలుచున్నారనుకుంటున్నారా! (మార్క్స్ సృష్టించిన) భూకంపంతో ఈ సమాజం పునాదులు కదిలిపోతున్నాయి. మీ విశ్వాసాల భవంతులు కూలిపోతున్నాయి. మీరు అచంచలమూ, శాశ్వతమనుకున్నవన్నీ నేలమట్టమవుతున్నాయి' అని రాసుకుంది.

మార్క్స్, జెన్నీకి రాసిన లేఖలు లభ్యం కావటం లేదుగాని, ఆమె రాసిన లేఖల ప్రకారం తను చాలా ఆందోళనలో గడిపింది. మార్క్స్ కార్యకలాపాల వల్ల పరపతి పెరిగింది. ట్రీయర్‌లో అందరూ అతడు బాగా సంపాదిస్తున్నాడనే అనుకున్నారు. తను కూడా హుందాగా, సంపన్నురాలిలాగా అందరి ముందూ ప్రవర్తించింది.

జెన్నీ ఈ మాటలు రాసిన నెలరోజుల తర్వాత ప్రష్యా నిజంగానే కంపించింది. జూన్‌లో సిలేసియాలో జరిగిన నేత కార్మికుల తిరుగుబాటు తర్వాత ఫ్రీడ్రిక్ విల్హెమ్ IV మీద జరిగిన హత్యా ప్రయత్నం విఫలమైంది. ఇప్పుడు కూడా జెన్నీ ప్రకారం దుండగుడు, రాజకీయ, కారణాలవల్లగాక, కేవలం ఆకలికి తాళలేక ఆ పని చేశాడు. కార్ల్‌కు రాసిన ఓ లేఖలో అ నేరస్తుణ్ణి ఆమె వర్ణించింది. "మూడు రోజులుగా పస్తులున్న అతడు బెర్లిన్ వీధుల్లో ముష్టి ఎత్తుకున్నాడు. అంటే హత్యా ప్రయత్నానికి భౌతిక కారణాలున్నాయి. ఇక, సామాజిక విప్లవానికి బీజాలు పడినట్టే. కాని ప్రజలు ఈ విషయం గ్రహించనట్టు లేరు. చర్చిలకు వెళ్లి, రాజుగారు క్షేమంగా ఉన్నందుకు ప్రార్థనలు చేస్తున్నారు".

జెన్నీ రాసిన ఈ లేఖను ఆగస్టు 10, 1844 నాడు తన పత్రికలో 'ఒక జర్మన్ లేడీ' రాసిన లేఖగా ప్రచురించాడు మార్క్స్. ఇంకేముంది ఈ పత్రిక కూడా జర్మన్ అధికారుల దృష్టిలో పడింది. అప్పటికే వాళ్లు, హత్యా ప్రయత్నం గురించి కూపీ లాగే పనిలో ఉన్నారు. పైగా పత్రికలో ప్రభుత్వ గూఢచారులున్నారు. ఈ ప్రచురణ తర్వాత, రాజుగారు దైవాంశ సంభూతుడు కాడనీ, మానవ మాత్రుడనీ స్పష్టమైంది. పత్రిక గురించి ప్రష్యన్ ప్రభుత్వం, ఫ్రెంచి అధికారుల మీద ఒత్తిడి తెచ్చింది. పత్రిక లైసెన్స్ గురించి వివాదం లేవదీశారు. ఎడిటర్ ఇన్‌ఛీఫ్‌ను రెండు నెలలపాటు జైల్లో పెట్టారు. పత్రికలో పనిచేసే మిగతా సిబ్బంది కూడా పరిణామాలను ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉన్నారు.

ఈ ఉద్రిక్త వాతావరణంలో, పారిస్‌కు తిరిగి రావటానికి సిద్ధపడింది జెన్నీ. పరిస్థితులు మారిపోతున్నాయి. భర్త పక్కన ఉండాలి తను. కార్ల్‌కు రాసిన లేఖలో, 'ఎన్నాళ్లు మన కూతరు ఒంటరిగా ఆడుకోవాలి. ఇద్దరమూ దానికి ఇరుపక్కలా చేరి యుగళ గీతం పాడదాం' అంటుంది.

అన్ని విషమ పరిస్థితుల్లోనూ, కార్ల్ పక్కనే నిలిచింది జెన్నీ. లోకమంతా ఆయన్ను వ్యతిరేకించినా ఆమె సమర్థించింది. అతడు ప్రమాదంలో చిక్కుకుంటే రక్షించింది. ఆర్థిక సమస్యలు ఇప్పుడామె దృష్టికే రాలేదు. జెన్నీ లేఖ చేరిన కొద్ది రోజులకే మార్క్స్‌కు మరొక వ్యక్తితో పరిచయమైంది. అతడే ఆయన జీవిత కాలమిత్రుడు ఫ్రెడెరిక్ ఎంగెల్స్.

(సశేషం)

సంప్రదాయ చదువుల సరిహద్దులు దాటేద్దాం!

'నిరక్షరాస్యత మన దేశానికి ఉన్న అతి పెద్ద కళంకం. దానిని విధిగా నిర్మూలించాలి' అన్న గాంధీ మాటలు ఇంకా దేశమంతా ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. 1990వ సంవత్సరాన్ని అంతర్జాతీయ అక్షరాస్యతా సంవత్సరంగా ప్రకటించింది ప్రభుత్వం. 21వ శతాబ్దంలోకి భారతదేశం సంపూర్ణ అక్షరాస్యతతో అడుగు పెట్టాలనే నేటి పాలకుల మాటలు కోటలు దాటాయి. ఆచరణలో అడుగు ముందుకేయలేదు. 68 సంవత్సరాలుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే...ఇటీవల విద్యాశాఖ కేంద్రస్థాయి వాస్తవాలు దిమ్మెరపరిచాయి. ఉన్నత పాఠశాల స్థాయికి వచ్చిన విద్యార్థులలో 45 శాతం తెలుగు రాయలేకపోతున్నారు. సరిగ్గా చదవలేకపోతున్నారు. ప్రతి నలుగురు స్త్రీలలో ముగ్గురు నిరక్షరాస్యులు. ప్రపంచ అక్షరజ్ఞానం లేని మహిళల్లో సగానికి పైగా భారతీయులే. ఐరాస సంస్థ యునెస్కో నిర్వచనాన్ని(మాతృభాషలో చదివి అర్థంచేసుకోగలిగి రాసే సామర్థ్యం ఉన్నవాడే అక్షరాస్యుడు) అన్వయిస్తే దేశంలో ఎంత శాతం అక్షరాస్యులుగా

అభ్యాసకుల మనసుపై చెరగని ముద్రను వేయగల, వారి జ్ఞాపక శక్తిని బ్రహ్మాండంగా పెంచగల శక్తిని కలిగియున్న లయను సప్తస్వరాలైన 'సరిగమ పదని'ల ద్వారానూ, పరుష, సరళాక్షరాలతోనూ జనింపజేయవచ్చు అని నిరూపించటం జరిగింది.

ఉంటారు అనే విషయం ఊహించుకోవటానికే భయమేస్తుంది. ఇప్పటికీ దేశంలో కోట్లాది మంది నిరక్షరాస్యులు, ప్రభుత్వ పాఠశాలలో చదువు పేరుకే అన్నట్లయి అక్షర జ్ఞానాన్ని అందుకోలేని అభాగ్యులు మరెందరో. దీనంతటికీ కారణం అక్షరాస్యతా సమస్యను ఒక సవాల్‌గా తీసుకోకపోవడమే. వాచకాల భాష, వాటి బోధన అభ్యాసకులు జీర్ణం చేసుకునేదిగా ఉండక పోవడం, ఒక తంతుగా చేస్తున్న భాషా బోధనలో ఆధిపత్య ధోరణి తప్ప ప్రేమతో అందించే మనసు లేకపోవడం అనేవి విద్యా బోధనలో నిత్యం కనపడేవే.

ఏళ్ల తరబడి పేరుకున్న నిర్లక్ష్యం ఒక్క ఉదుటున కొట్టుకపోదు, ఉన్నట్టుండి పద్ధతులు మారిపోవు. అయినా ప్రజల హితం కోరేవారు ప్రత్యామ్నాయ ప్రతిపాదనలను చేయక మానరు. అలా స్వాతంత్ర్య సమరయోధుడు గాడిచర్ల హరిసర్వోత్తమ రావు చేసిన ప్రత్యామ్నాయ ప్రతిపాదనను పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఆ ప్రతిపాదనను నెల్లూరు నరసింహారావు మరింతగా పదునుపెట్టి తెలుగు నేర్పటానికి ఒక నూతన పద్ధతిని రూపొందించారు. అ పద్ధతే ఎన్.ఆర్. పద్ధతి. ఆ పద్ధతిని తెలుగు వాచకం (వారంలో తెలుగు)గా 'ప్రజాశక్తి బుక్ హౌస్' ప్రచురించటం జరిగింది. నిజానికి ఈ ప్రచురణ మొదటిసారి జరిగింది కాదు. ఖమ్మం జిల్లాలో అనేక గ్రామీణ పాఠశాలల్లోను, వయోజన విద్యా కేంద్రాలలోను, ఆదిలాబాద్ జిల్లాలోని సింగరేణి కార్మికులకు, అక్కడి పాఠశాలలో ఈ పద్ధతిని ఆచరించి తెలుగును బోధించారు. అతి తక్కువ సమయంలో తెలుగును నేర్పగల శక్తి ఈ పద్ధతి సొంతం. ఆచరించి చూస్తే మొదటి రోజే ఈ పద్ధతి ప్రయోజనం తెలుస్తుంది.

అసలు ఎన్ ఆర్ పద్ధతి అంటే ఏమిటి? భారతీయ భాషలు నేర్పటానికి దాదాపు 500 అక్షరాలను గుర్తుపట్టగలగాలి. అలా గుర్తుపట్టగలిగితేనే ఎవరైనా చదవగలుగుతారు. అయితే అది అంత సులభం కాదు. క్రిష్టఫర్ కాల్డ్‌వెల్ రాసిన 'ఇల్యూజన్ అండ్ రియాలిటి' గ్రంథంలో లయ ప్రాధాన్యతను వివరించారు. ఇతర ప్రయోజనాలతో పాటు లయతో జ్ఞాపక శక్తి అపారంగా పెరుగుతుందని సూత్రీకరించాడు. రవీంద్రనాథ్ ఠాగూర్ తన 'గీతాంజలి'లో 'ఈ మనోజ్ఞ లయకు పరవశించని హృదయమేదీ?' అని ప్రశ్నిస్తాడు. అలానే ప్రముఖ బ్రెజిలియన్ తత్వవేత్త పాలో ఫ్రెయిరీ తన 'పెడగాగీ ఆఫ్ ద అప్రెస్డ్' గ్రంథంలో విమర్శనాత్మక బోధనా పద్ధతిని రూపొందించి ప్రజల భాషలో ప్రజలకు ఎలా బోధించాలో చెప్పాడు. అంటే ప్రజలు నిత్యం మాట్లాడుకునే భాషలోనే చదువ నేర్పిస్తే వేగంగా నేర్చుకోగలుగుతారు. ఇది జరగాలంటే భాషాధ్యయనంలో ముఖ్యంగా రెండు మార్పులు జరగాలి. మొదటిది లయను జనింపజేసే విధంగా అక్షర క్రమం, వీలున్నంత వరకూ పద క్రమం ఉండాలి. రెండవది, భాషాధ్యయనంలో అభ్యాసకులు తమ స్వంత భాషను ఉపయోగించే ఏర్పాటు ఉండాలి. అంటే అభ్యాసకులది ఏ యాసైనా లేక ఏ మాండలీకమైనా అదే యాసలో లేక అదే మాండలీకంలో వారు తెలుగు నేర్చుకోగలగాలి. ఈ సౌకర్యాన్ని ఏ వాచకమూ అందించ లేదు ఒక్క 'ఎన్ ఆర్ పద్ధతి' తప్ప.

అదేలా? అభ్యాసకుల మనసుపై చెరగని ముద్రను వేయగల, వారి జ్ఞాపక శక్తిని బ్రహ్మాండంగా పెంచగల శక్తిని కలిగియున్న లయను సప్తస్వరాలైన 'సరిగమ పదని'ల ద్వారానూ, పరుష, సరళాక్షరాలతోనూ జనింపజేయవచ్చు అని నిరూపించటం జరిగింది. అంటే అక్షరాలను ఈ విధంగా క్రమం మార్చి రాయటం జరిగింది: స ర గ మ / ప ద న / వ ల య / క చ ట త ప / గ జ డ ద బ / స శ ష / న ణ. ఇక మిగిలినవి హ క్ష ళ మాత్రమే. అలాగే అభ్యాసకులు తాము మాట్లాడే భాషలోనే అభ్యసించటానికి అవకాశమిచ్చే బోధనా పద్ధతిని రూపొందించారు (ఈ బోధనా పద్ధతి ఆచరణలో ఎలా ఉంటుందో చూడటానికి ఈ లింకు https://soundcloud.com/narasimha-rao-nellore/01-vaaramlo-chadhuuvu1 ను కాపీచేసి ఇంటర్‌నెట్ బ్రౌసర్‌లో పేస్ట్ చేస్తే మీరు వినగలుగుతారు).

తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో భారతీయ భాషలను ముఖ్యంగా తెలుగును నేర్పించగలిగే పద్ధతిని రూపొందించటం బహుశా ఇదే మొదటిసారి అని నేను భావిస్తున్నాను. గతంలో చాలా మంది ప్రముఖులు అనేక వాచకాలను రాశారు. అయితే ఇంతకుముందు ఎవ్వరూ ఫలానా కారణం చేత ఫలానా విధంగా చేస్తే తెలుగును వేగంగా నేర్చుకోగలుగుతారని సూత్రీకరించి ఆచరణలో పెట్టలేకపోయారు. 'ఎన్ ఆర్ పద్ధతి'కి జీవితాలను మార్చగలిగే(లైఫ్ ట్రాన్స్‌ఫార్మింగ్) శక్తి ఉన్నదని వాస్తవంలో ఋజువయింది. ఇది ఆచరణకు వీలుకాని మరో సిద్ధాంతం కాదు. అభ్యసన ప్రక్రియలో దీని ప్రభావం ప్రతి గంట గంటకూ తెలుస్తుంది. ఒక్క రోజు ఈ పద్ధతిలో బోధించినా ఇది నిజమా కాదా అనేది తెలుస్తుంది. ముందుగా కావలసింది నిరక్షరాస్యతను అధిగమించాలనే సంకల్పం. ఆ తరువాత చేయవలసిందల్లా ఒక వారం, పది రోజులు కష్టపడటం. అంతే తెలుగు చదవటం వచ్చేస్తుంది!

- భూపతి వెంకటేశ్వర్లు, 9490098343

■ జోక్స్ కార్నర్

అపార్థం

భార్య: నేను పాట పాడుతుంటే వెళ్ళి బాల్కనీలో ఎందుకు నుంచుంటున్నారు? నా పాట వినడం మీకు ఇష్టం లేదా?

భర్త: అదేం కాదు. ఇరుగుపొరుగు వారు అపార్థం చేసుకోకూడదని.

భార్య: అదేమిటి?

భర్త: నేను నిన్ను కొడుతున్నానేమో అని నన్ను అపార్థం చేసుకునే అవకాశం వుంది కదా! అందుకే బాల్కనీలో నుంచున్నాను.

నీ కంటే ఇష్టమా?

భార్యాభర్తలు కాశీకి వెళ్ళారు.
"ఏమండీ! ఇక్కడ మనకిష్టమైనవి రెండు వదిలేయాలట!"
"నువ్వెంత అయినా చెప్పు నేను ఒక్కటే వదిలేయగలను"
"అదేమిటండీ! రెండు వదలాలిట!"
"ఈ ప్రపంచంలో నీకంటే నాకు ఇష్టమైంది మరోటి లేదు కదా!"

మిగిలిన మూడు

"ఏమిటి సార్ అంత విచారంగా వున్నారు?" అడిగాడు కాంట్రాక్టర్ మాధవరావు దగ్గర పనిచేస్తున్న అసిస్టెంట్.

"ఏం చేయమంటావు చెప్పు, ఒకటవ అంతస్థు, అయిదో అంతస్థు పడగొట్టమని కోర్టు ఆర్డరేసింది" విచారంగా అన్నాడు కాంట్రాక్టర్.

"అంతేకదా సార్! మొత్తం అయిదు అంతస్థులు పడగొట్టమనలేదు కదా! ఇంకా మూడు అంతస్థులు మనకు ఉంటాయి మీరేం దిగులు పడకండి సార్".

విరాళం

"వరద బాధితుల సహాయార్థం మా ఆఫీసులో అందరం ఒకరోజు జీతం విరాళంగా ఇచ్చాం" గొప్పగా చెప్పాడు అప్పారావు.

"అంతేనా? మేం మా ఒక్కరోజు లంచాన్ని విరాళంగా ఇచ్చాం తెలుసా?" అంతకన్నా గొప్పగా చెప్పాడు సుబ్బారావు.

సంతకం

పల్లె నుంచి పట్నానికి ఉద్యోగరీత్యా వచ్చింది లలిత. ఆఫీసులో జీతం చెక్కురూపంలో ఇచ్చారు. దాన్ని తీసుకుని బ్యాంకులో డబ్బుల కోసమని వెళ్ళింది. అక్కడ క్లర్కు చెక్కు వెనకాల సంతకం పెట్టమన్నాడు. దానికి –

"సంతకం ఎలా పెట్టను?" అని అడిగింది లలిత.

"మీ వారికి ఉత్తరం రాసినప్పుడు చివర ఏమని సంతకం పెడతారో అలా పెట్టండి" అని సలహా ఇచ్చాడు క్లర్కు.

"అలాగే" అంటూ 'యువర్ లవింగ్ లలిత' అని సంతకం చేసి క్లర్కుకి ఇచ్చింది.

కొత్త విషయం

"న్యూటన్ తోటలో కూర్చుని వుండగా అతని తలపై ఒక యాపిల్ పండు పడింది. దాన్నిబట్టి అతను 'భూమ్యాకర్షణశక్తి'ని కనుక్కున్నాడు. మీరు కూడా అతనిలా ఏదో ఒక కొత్త విషయాన్ని కనుక్కోవాలి" అన్నాడు లెక్చరర్ విద్యార్థులతో గంభీరంగా.

"మీరు చెప్పింది నిజమే సార్. కానీ న్యూటన్ తోటలో కూర్చోకుండా మాలా క్లాసులో కూర్చునివుంటే ఈ విషయాన్ని కనుక్కోలేడు కదా మాస్టారు" అన్నాడు ఓ తెలివైన విద్యార్థి.

మర్చిపోలేని సంఘటన

మీ జీవితంలో మర్చిపోలేని విషయాలు, బాగా ఇష్టమైన విషయాలు ఇందులో ఏమైనా ఉన్నాయేమో చూడండి...

★ చివరి పరీక్ష రాసిన రోజు

★ ఏ అర్థరాత్రో మెలకువ వచ్చి తెల్లారిందనుకుని టైం చూస్తే, తెల్లారడానికి ఇంకా చాలా సమయం ఉన్నప్పుడు

★ స్కూల్/ కాలేజ్/ ఆఫీస్ కి అనుకోకుండా సెలవు ఉందని తెలిసినప్పుడు

★ బాగా ఇష్టమైన వ్యక్తి అనుకోకుండా తారసపడినప్పుడు

★ ఎప్పుడో ఎలిమెంటరీ స్కూల్లో మనతో పాటు చదివిన స్నేహితులు కనిపించినప్పుడు

★ ఆదివారం సాయంత్రాలు పాత స్నేహితులతో కబుర్లు

★ ఎవరి కోసమైనా ఒంటరిగా ఎదురు చూడడం

★ బాగా వర్షం పడుతున్నప్పుడు హైవే రోడ్డుమీద ప్రయాణం

ఈ విధంగా మీరు మరిచిపోలేని అరుదైన సంఘటన గురించి రాసి మీ ఫొటోతో సహా పంపించండి. సోపతిలో ప్రచురిస్తాం.

మొక్కలు కీటకాలనెలా ఆకర్షిస్తాయి?

ఆకుపచ్చని మొక్కలు కిరణజన్య సంయోగక్రియ ద్వారా ఆహారపదార్థాలను ఉత్పత్తిచేస్తాయి. అవి స్వయంపోషితాలు. అంతే కాకుండా ఈ సృష్టిలోని జీవరాసులన్నిటికీ అవసరమైన ఆహార పదార్థాలనుత్పత్తి చేసే ప్రాథమిక ఉత్పత్తిదారులు. సౌరశక్తిని బంధించి వినియోగించగల సామర్థ్యం కేవలం ఆకుపచ్చని మొక్కలకే ఉంది. పోషణ రీత్యా ఇంతటీ శక్తి సామర్థ్యాలు గల మొక్కలు సైతం కొన్ని జీవన కార్యకలాపాల నిర్వహణకు కీటకాలపై ఆధారపడతాయి. స్థిరజీవనం చేసే మొక్కలు కొన్ని ప్రలోభాలను కల్పించడం ద్వారా, చరజీవనం గడిపే కీటకాలనాకర్షించి తమ అవసరాలు తీర్చుకొంటాయి.

మొక్కల్లో విశిష్టమైన జీవనం గడిపే కీటకాహార మొక్కలు (మాంసాహార మొక్కలు) నత్రజని లోపించిన నేలల్లో జీవిస్తుంటాయి.

బ్లూఫ్లోరెసెన్స్ ప్రాముఖ్యతను గుర్తించడానికి, కీటకాలను ఆకర్షించడంలో దానిప్రాత తెలుసుకోవడానికి శాస్త్రజ్ఞులు నెపెంథిస్ కాసియానా (కూజామొక్క) యొక్క బ్లూఫ్లోరోసెన్స్ వెలువరించే భాగాలను ఇతర పదార్థాలతో మూసివేశారు. ఇలా 10 రోజులు చేసిన ప్రయోగంలో నెసెంథిస్‌లో కీటకాలను ఆకర్షించే శక్తి గణనీయంగా తగ్గినట్లు గుర్తించారు.

పోషణలో నత్రజని లోపాన్ని పూడ్చుకోవడానికి కీటకాహార మొక్కలు కీటకాల నాకర్షించడానికి, ఎన్నో ఏర్పాట్లు చేసుకొంటాయి. కీటకాలను పట్టి బంధించి, జీర్ణం చేసుకోవడం ద్వారా నత్రజని లోపాన్ని పూడ్చుకొంటాయి. పుష్పించే మొక్కలు పరాగసంపర్కం సిద్ధించడానికి కీటకాలపై ఆధారపడతాయి. ఇందుకై అవి అనేక టెక్నిక్‌లను ఉపయోగిస్తాయి. వివిధ ఆకర్షణీయమైన రంగుల్లో పుష్పాలనుత్పత్తి చేయడం, మకరంద గ్రంథులు కలిగి వుండటం, మిమిక్రీ చేయడం లాంటివి వీటిలో ముఖ్యమైనవి. కొన్ని ప్రత్యేక భౌగోళిక ప్రాంతాల్లో పెరిగే కీటకాహార మొక్కలు కీటకాలను బంధించి, జీర్ణం చేసుకొని తమ పోషణ అవసరాలను తీర్చుకొంటాయి. మాంసాహార మొక్కలు పట్టుకొనే కీటకాల్లో చీమలు, ఇతర కీటకాలు, ఆర్థ్రోపోడ్‌లు ఉంటాయి. మొక్కలు మాంసాహారం తీసుకోవడం కేవలం తమ పోషణ అవసరాలు తీర్చుకోవడానికే.

స్థిరజీవనం గడిపే మొక్కలు కొన్ని జోన్లను ఏర్పాటు చేసి కీటకాలను పట్టుకొంటాయి. ఇందుకోసం పత్ర భాగాలు జోన్లుగా ఏర్పడతాయి. ఎరను ఆకర్షిస్తాయి. కీటకాలను పట్టుకొనే ఉపాంగాలు పుష్పాల్లాగా సువాసనను వెదజల్లుతాయి. పుష్పాలను పోలి ఉండేట్లు మిమిక్రీ చేస్తాయి. ఇలా కీటకాలు తమ దగ్గరకు వచ్చేట్లు చేస్తాయి. ఆనక తమ పనికానిస్తాయి. కేరళలోని తిరువనంతపురంలోగల జవహర్‌లాల్ నెహ్రూ ట్రోపికల్ బోటానిక్ గార్డెన్ మరియు రిసెర్చ్ ఇన్‌స్టిట్యూషన్‌కు చెందిన శాస్త్రజ్ఞుల బృందం జరిపిన పరిశోధనలలో, కీటకాలను బంధించడానికి మొక్కలు మరొక ఏర్పాటు కలిగి ఉన్నట్లు తెలుస్తోంది. కూజా మొక్కలైన నెపెంథిస్, సర్రసీనియా వంటి జాతులు విలక్షణమైన బ్లూఫోరెసెన్స్ వెలువరిస్తాయని వీరి పరిశోధనలు తెలియజేస్తున్నాయి. నెపెంథిస్‌తో పాటు ఇతర కీటకాహార మొక్కలైన డ్రోసెరా, సింగిక్యులా, డయోనియా మరియు యుట్రిక్యులేరియాల్లో కూడా ఇలాంటి ఏర్పాటు ఉన్నట్లు తెలుస్తోంది. బ్లూఫోరెసెన్స్ మూసివేసినప్పుడు మొక్కలకు కీటకాలను బంధించేశక్తి గణనీయంగా తగ్గినట్లు గమనించబడింది. ఈ విషయాలు 'ప్లాంట్ బయాలజీ' అనే జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. పరిశోధక బృందానికి చెందిన సుబులాల్ బేబీ ప్రకారంగా, కీలకాహార మొక్కల్లో ఈ లక్షణం ఇప్పటిదాకా గుర్తించలేదని తెలిపారు.

విలక్షణమైన బ్లూఫోరెసెన్స్ వీనస్‌ఫ్లైట్రాస్ (నెపెంథిస్) మొక్క కూజా మూత, లోపలి అంచుల వెంట, పెరిస్టోమ్ భాగాన్ని అతినీలలోహిత కిరణాల ప్రభావానికి గురిచేసినప్పుడు తెలిసింది. కీటకాలు ఆకర్షించబడి, కూజాలోపడి, మరణించి, జీర్ణమయ్యే దశలో బ్లూఫ్లోరెసెన్స్ తగ్గిపోయినట్లు గుర్తించారు. కీటకాల ఆకర్షణలో బ్లూఫ్లోరెసెన్స్ ఎంతో ఉపయోగపడుతున్నట్లు అర్థమౌతుంది. ఈ ఏర్పాటు రాత్రులందు కూడా కీటకాలను ఆకర్షిండంలో తోడ్పడుతున్నట్లు గమనించారు.

బ్లూఫ్లోరెసెన్స్ ప్రాముఖ్యతను గుర్తించడానికి, కీటకాలను ఆకర్షించడంలో దానిప్రాత తెలుసుకోవడానికి శాస్త్రజ్ఞులు నెపెంథిస్ కాసియానా (కూజామొక్క) యొక్క బ్లూఫ్లోరోసెన్స్ వెలువరించే భాగాలను ఇతర పదార్థాలతో మూసివేశారు. ఇలా 10 రోజులు చేసిన ప్రయోగంలో నెసెంథిస్‌లో కీటకాలను ఆకర్షించే శక్తి గణనీయంగా తగ్గినట్లు గుర్తించారు. దీన్నిబట్టి బ్లూఫ్లోరెసెన్స్ కీటకాలను ఆకర్షించడంలో కీలకపాత్ర పోషిస్తున్నట్లు తెలుస్తోంది.

– డా॥ సమ్మెట గోవర్ధన్, 9949038471

■ ఎరుక : మునిమడుగుల రాజారావు

ఆనందాన్నిచ్చే పరిపూర్ణ'పని'

ఎంతో ఇష్టంగా ఒక పనిని ప్రారంభించి, ఆ పనిలోని ప్రతీ ఒక అంశాన్ని ఎంతో ప్రేమతో స్పృశించి, పని చేయడం లేదా పని జరగడం అనే ది ఒక సృజనాత్మక అనుభవం. ఆ పని ఆవరణలోని ప్రవాహంలో పడి పరిపూర్ణంగా కొట్టుకుపోతూ, ఆ క్రియ ఆక్రమించే ప్రాంతాన్ని నూటికి నూరు పాళ్ల తాకుతూ, భవిష్యత్తులో ఇలాంటి అవకాశం మళ్లీ రాదేమో అనుకునేంతగా నిమగ్నం కావడం విలక్షణమైన అనుభవం. ఆ పనిని సర్వసమగ్రంగా నిర్వహించి, పూర్తి చేసినపుడు చెప్పలేనంత ఆనందం వెల్లువెత్తుతుంది. దీనికి గల కారణాల్ని వివేచిస్తే తెలిసేది ఒక్కటే- పనికి, పని చేసేవాడికీ మధ్య ఎలాంటి బంధం ఏర్పడి (లేదు) కాబట్టి.

ఇది కాస్త తాత్వికమైన భావనగా అనిపించవచ్చు. కానీ లోతుగా చూస్తే తప్ప ఈ మాటల అంతరార్థం మనసుకు పట్టదు. కానీ ఆలోచించి తెలుసుకోవడం మనసుకు వ్యాయామం. బంధం అంటే జ్ఞాపకం. అప్పుడెప్పుడో జరిగిపోయిన దానిని మళ్లీ మళ్లీ గుర్తుకు తెచ్చే జ్ఞాపకం-నిజంగా బంధమే. జరిగినదేదో జరిగిపోయింది. అది తిరిగి గురుక్తు వచ్చీ బరువుగానూ, భారంగానూ ఉండేలా ఎందుకు చేస్తుంది? గతంలో జరిగిపోయి ముగిసిపోయిన ఒక కార్యం మళ్లీ తనవైపునకు తిప్పుకోవాల్సిన అవసరం ఎందుకు వస్తుంది?

అయిష్టంగా చేపట్టిన ఒక పని, ప్రేమ రాహిత్యంలో సాగిన ఒక పని, కేవలం లాంఛనప్రాయంగా చేయబడిన ఒక పని, అసమతుల్యంగా, పాక్షికంగా ముగించి వేయబడ్డ ఒక పని, తప్పులు తప్పులుగా చేయబడిన ఒక పని, మధ్యలోనే వదిలేసి వాయిదా వేయబడ్డ ఒక పని- మాత్రమే బంధంగా తయారవుతుంది. మిగిలిపోయిన పని మళ్లీ వెనక్కి పిలుస్తుంది. అసంపూర్తిగా వదిలేసిన దానిని పరిపూర్ణంగా పూరించమంటుంది. తప్పులు దొర్లిన ప్రతీ చోట సరిచేయమంటుంది. అందుకని అది మళ్లీ వెనక్కి రమ్మని పిలుస్తూ ఉంటుంది. వెనక్కి పిలవడమంటే బంధమై నిలవడమే కదా! అంటే, జ్ఞాపకం కొనసాగడం. అంటే, గతాన్ని మోయడం. అంటే, సిద్ధంగా ఉన్న, అందుబాటులోనే ఉన్న వర్తమానాన్ని వదులు కోవడం. దరిమిలా వర్తమానం ఇచ్చే సౌందర్యాన్ని అది మిగిల్చే ఆనందాన్ని చేజేతులా జారవిడుచు కోవడం. బంధంతో ఉన్నప్పుడు స్వతంత్రత ఉండదు. అది ఉండనప్పుడు స్వేచ్ఛ ఉండదు, ప్రామాణిక సూత్రాలతో కూడిన ఒక సాధికారిక జీవితం ఉండదు.

ఈ సృష్టిలో ప్రతీ జీవి స్వయంప్రతిపత్తి కోసం, స్వేచ్ఛ కోసం పోరాడుతూ ఉంటుంది. ఒక పక్షిని పంజరంలో బంధించి చూడండి. పంజరానికి, పక్షికి బంధం మొదలైన క్షణం నుండి బంధ విముక్తి లభించే క్షణం వరకూ అది పోరాడుతూనే ఉంటుంది. బోనులో చిక్కిపోయిన ఎలుకని గమనించండి. అది క్షణక్షణానికి బోనంతా కలియా తిరుగుతూ, ఒక నిర్విరామ నిరంతర పోరాటం కొనసాగిస్తుంటుంది. కారణం, దానికి స్వేచ్ఛ కావాలి. అది, జీవితం పరుచుకున్నంత దూరం ఉల్లాసంగా, ఉత్సాహంగా పరుగులు తీయాలి. దాని జీవితమంతా ఆనందంగా గడిపేయాలి.

ఆలోచనలు లేని (అసలే లేవు అని అనుకుంటాం) జీవుల జీవన గమనం ఇంతటి అద్భుతంగా ఉన్నప్పుడు ఆలోచనా శక్తి, సామర్థ్యాలు, దార్శనిక సాంద్రతలు పుష్కలంగా ఉన్న మనిషి జీవన గమనం మరెంతో గొప్పగా ఉండాలి. కానీ అందుకు విరుద్ధమైన పరిస్థితులు చూస్తున్నాం. స్వతంత్రంగా ఆలోచించగలిగిన జీవి అయిన మానవుడు అనేకానేక సంక్లిష్టతల మధ్యన కునారిల్లుతున్నాడు. సవ్యంగా ఆలోచించలేకపోవడం, స్వేచ్ఛగా వ్యవహరించలేకపోవడం వల్ల చేసే పనులు అసంపూర్ణం. ఆ అసంపూర్ణత ఫలితం అసంతృప్తి. లేదంటే వైఫల్య భయం వెంటాడుతుంది. ఈ భయాలు, అసంతృప్తులు లేని స్థితిలో ఒక పనిని స్వేచ్ఛగా పూర్తి చేస్తారు. ఎలాంటి బంధనాలు లేకుండా పనిలో త్రికరణశుద్ధిగా లీనమై చేస్తాడు. అక్కడ అనుభవించే ఆనందానుభూతులు అలవికానివి. అలాంటి పనులు మాత్రమే మనిషి సృజనాత్మక జీవితానికి ఆలంబనగా నిలుస్తాయి. పరిపూర్ణతను చేకూరుస్తాయి.

రచయిత సెల్ : 949343130

స్ఫూర్తినిచ్చిన గురువు ఎవరు?

బడికి వెళ్ళినప్పట్నించి కాలేజీ దశ వరకు ఎందరో ఉపాధ్యాయులు మనకు పాఠాలు బోధిస్తారు. వారిలో కొంతమంది గుర్తుండిపోతారు. కొందరు గొప్ప స్ఫూర్తిని ఇస్తారు. వారు చెప్పిన పాఠాలుగానీ, కొన్నిమంచి మాటలు గానీ మనసులో ముద్రించుకుపోతాయి. ఆవిధంగా మిమ్మల్ని ప్రభావితం చేసిన ఉపాధ్యాయుల గురించి ఈ శీర్షికకి రాయండి. మీకు స్ఫూర్తినీ, ఉత్తేజాన్నీ ఇచ్చి ప్రోత్సహించిన ఉపాధ్యాయుల్ని ఈ శీర్షిక ద్వారా గుర్తు చేసుకోండి.

మీ రచనతో పాటు ఫోటో కూడా పంపండి. 'సోపతి'లో ప్రచురిస్తాం.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్రజాశక్తి తెలుగు డైలీ, 21/1, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-20

రచయితలకు సూచనలు

✎ 'సోపతి' కోసం వ్యాసాలు, కథలు, కవితలు పంపించండి.

✎ కథకు పేజీల పరిమితి లేదు. కథ అయి వుండాలి, అంతే! చదివించే గుణమే ప్రధానం.

✎ అనువాద కథ, కవితలు కూడా పంపించవచ్చు. మూల రచయిత అనుమతి పత్రం తప్పనిసరి.

✎ యాత్రా కథనాలకు ప్రత్యేక ప్రాధాన్యం. మీరు చూసి వచ్చిన ప్రదేశాల గురించి, మీ అనుభవ నేపథ్యంలో రాసి, తగిన ఫోటోలతో పంపించండి.

✎ రచనల్ని తిప్పి పంపాలనుకునేవారు తగిన స్టాంపులున్న కవర్‌ని జత చేయాలి.

✎ రచనతో పాటు రచయిత అడ్రసు ఉండాలి.పిన్‌కోడ్ నెంబరు తప్పనిసరి అవసరం. మీ ఫోను నెంబర్, వీలయితే ఈమెయిల్ కూడా ఇవ్వడం మంచిది.

✎ రచనల ప్రచురణకు సంబంధించి ఫోన్లలో ఎలాంటి సంప్రదింపులకు తావు లేదు.

✎ ఆరోగ్యకరమైన హాస్య, వ్యంగ్య రచనలకు ప్రాధాన్యం వుంటుంది.

✎ సమీక్షకోసం పుస్తకాలు పంపేవారు రెండు ప్రతులు పంపించాలి.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్రజాశక్తి తెలుగు డైలీ, 21/1, ఎమ్.హెచ్.భవన్, అజామాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగలింగంపల్లి, హైదరాబాద్-20

■ నవరాగం

అనగనగ ఒక కల!

ఆ కలలో అతను, ఆమె!

అతని మాట, అతని చూపు, అతని స్పర్శ, అతని ఊహ, అతని ఆలోచన, అతని తలపు... అన్నీ పరమ పరమ ఇష్టం ఆమెకి.

అతనూ అంతే! ఎక్కడున్నా, ఏం చేస్తున్నా, ఎంతమందిలో వున్నా ఆమె గురించి తలపే! ఆమె గురించి చింతనే! దారిలో పున్నాగపూలని చూస్తే... చిన్నప్పుడు పూలను ఏరుకుంటూ కనిపించినప్పటి ఆమె లేత చూపు తలపుల్లో స్ఫురణకొస్తుంది.

తొలి యవ్వనప్రాయంలో అనుకోకుండా ఓ ఉదయం వాళ్ళ ఇంటికి వెళ్ళినప్పుడు కాఫీ ఇస్తూ “రోజూ పొద్దుటే ఇలా నా చేతుల మీదుగా కాఫీ అందుకుంటావా” అంటూ అల్లరిగా అంటే... బేలగా... సిగ్గుపడుతూ ఏం చెప్పాలో తెలియనితనంలో బిత్తరపోయిన అతను...

ఆ చూపులోని అమాయకత్వాన్ని చూసిన ఆమె చిలిపిగా నవ్వుతూ తుర్రుమన్న వైనం...

స్త్రీలోని మార్దవం ఏమిటో ఆమె ద్వారానే కనుగొన్న అతను...

విశాలమైన బాహువుల్లోని వెచ్చదనం అతని ద్వారానే అనుభూతించిన ఆమె...

కల విరిగిన చప్పుడు

లోకంలో స్త్రీ అంటే ఆమె మాత్రమే అతనికి...

లోకంలో పురుషుడు అంటే అతను మాత్రమే ఆమెకి...

ఆఫీసులో నిరంతరం పనులు చేస్తూ కూడా అంతరంగాన ఒక పార్శ్వాన ఆమె ఆలోచన... ఆమె ఇష్టాల గురించిన చింతన...

డిసెంబర్‌లో ఎక్కడ సెలబ్రేట్ చేయాలన్న యోచన...

గడ్డకట్టే చలిరాత్రిన ఊటీలో ఎత్తయిన ప్రదేశంలో ఐస్‌క్రీమ్ తినాలన్న ఆమె కోరిక తీర్చాలన్న ఆలోచనల పరంపర... నిత్యమూ, నిరతమూ ఆమె ఆలోచనల్లో వెలిగే అతను...!

కోలీగ్ ధరించిన పసుపు వన్నె చీరని చూస్తే గుర్తుకొచ్చే అతని ఇష్టం... ఎల్లో అంటే అతనికెంత ఇష్టమో కదా... అన్న తలపు.

వద్దన్నా మరల మరల రకరకాల వెరయిటీల్లో ఎల్లో షేడ్స్‌లోని డ్రెస్సుల్లో తనని చూడాలనుకునే అతగాని ఇష్టం... మనసుని సైతం ఉక్కిరిబిక్కిరి చేసే అతని ఇష్టమైన ఆలోచన సమ్మోహనం చేస్తూనే వుంటుంది. తెలియకనే పెదాల మీదకి ఉబికి వచ్చే నవ్వు... అకారణమైన ఆ నవ్వేమిటని పక్కవాళ్ళు చూస్తారన్న బిడియం... అకారణం కాదు సకారణమేనని చెప్పేదెలా?

అతను... అతనే... అతని ఇష్టాలు, అతని ఆలోచనలు, అతని మాటలు, అతని చూపులు... తలపుకొచ్చిన ప్రతి సందర్భంలోనూ ఓ తెలియని పులకింత...

మాటల్లో చెప్పలేని ఆరాధనంతా చూపుల్లో రంగరించి చూసే అతని చూపులోని ఇష్టం తనకెంతో ఇష్టం... ఎదురుగా కూర్చొని మౌనంగా చూసే చూపులో ఒలికే అనురాగం... ఆ అనురాగపు తాలూకు ఊహాశాలిత కూడా ఆమె తనువుని పులకింపజేస్తుంది. మదిని నిమిషం నిలువనియ్యని ఉద్వేగపుటాలోచనలకు లోను చేస్తుంది...

ఎందుకింత ప్రేమ... ఎందుకింత ఆరాధన... ఎందుకింత మోహం...?!

ఈ ప్రేమ నిలిచేనా? నిలిచి వెలిగేనా? గాఢంగా పెనవేసుకున్న మనిషి పట్ల ఇష్టం కొనసాగేనా? హత్తుకున్న మనిషితో అంతే దయగా ఉంటారా? ప్రేమ ప్రేమగా నిరంతరం ఉంటారా?

ప్రశ్నల పరంపరతో కల విరిగిన చప్పుడు!

హత్తుకున్న మనిషిపై అనుమానపు చూపు

నువ్వు తప్ప మరో మనిషి తెలియదన్న మనిషిమీద విసిరిన ద్వేషబాణం

చెరలాట కాదురా ప్రేమ!

అది నిరతం లోలోపల వెలిగే జ్వాల!

ఆ వెలుగులో నిండుగా వెలిగే సౌందర్యసీమ ప్రేమ!

కానీ- అనుమానపు నీలినీడలు ప్రసరించిన క్షణాన

కలలు పెటేలుమంటాయి.

ఊహల రెక్కలు తెగిపడతాయి

విరిసిన కలల కుసుమాలు వాడిపోతాయి

అనురాగపుటలలు ముంచెత్తి మృత్యుశరాఘాతానికి లోను చేస్తాయి.

ఒక అనుమానం... ఒక ద్వేషం... ఒక అసూయ... అప్పటివరకు కలగా సాగిన జీవితాన్ని భగ్నం చేస్తాయి.

కలల చితిపేటిక మీద జ్ఞాపకాలు సైతం దగ్ధమవుతాయి.

ప్రేమ అంటే... ప్రేమ ఉంటే...

లోకాన్ని, మనుషుల్ని కూడా కరుణతో చూడగలగాలి.

దయతో ప్రవర్తించాలి.

సాటి మనుషుల సౌఖ్యం కోరాలి.

లోకం సుభిక్షంగా ఉండాలని ఆశించాలి.

ప్రేమ అంటే తమకు తాము పరవశించడమే కాదు, సంక్లిష్టమైన ప్రపంచాన్ని అర్థం చేసుకుంటూ సంయమనంతో మనగలగాలి. ఈ వివేచన లోపించిన క్షణాన ప్రేమ కురచనవుతుంది. కుదేలవుతుంది. ఊహల విహాయాసాలు విషాదాంతాలవుతాయి.

నిజంగా నిజం: ప్రేమంటే ఆ ప్రేమలో తాము వెలగడమే కాదు, లోకాన్ని వెలిగించాలి. సంక్షుభిత ప్రపంచాన కాసింత కరుణను కురిపించాలి. సాటి మనుషుల జీవితాన్ని ఉద్దీపింపజేయాలి. తమ ప్రేమ తమను ఎలాగో వెలిగిస్తుంది. ఆ వెలుగులో లోకాన్ని చూసి దయతో మెలగడమే అసలైన ప్రేమ ఔచిత్యం!

అప్పుడు అనగనగ ఒక కలగా ఆరంభమైన జీవితం వాస్తవంలోనూ సమ్మోహనభరితమవుతుంది.

– ప్రణీత్

సోర్స్ కోడ్

కె.ఎక్స్.రాజు

“అమ్మ”లాంటి యాప్

ప్రపంచాన్ని మన అరచేతిలోకి తెచ్చిన స్మార్ట్‌ఫోన్లు... రోజురోజుకు ఆత్మబంధువుల్లా మన జీవితాలతో పెనవేసుకుపోతున్నాయి. వినియోగదార్ల అవసరాలకనుగుణంగా ఎప్పటికప్పుడు పుట్టుకొస్తున్న కొత్తకొత్త మొబైల్ యాప్స్ మానవ జీవితాలను మరింత సుఖమయం చేసేస్తున్నాయి. గూగుల్ ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉన్న పలు యాప్స్ ఉపయోగకరమైన సమాచారంతో కనువిందు చేస్తున్నాయి.

గూగుల్ ప్లే స్టోర్‌లో 13లక్షలకు పైగా యాప్స్ ఉన్నాయి. ఇప్పుడొస్తున్న స్మార్ట్‌ఫోన్‌లలో మొబైల్ కంపెనీలు దాదాపుగా ఆండ్రాయిడ్ ఓఎస్‌నే నిక్షిప్తం చేస్తున్నాయి. వార్తలు తెలుసుకునేందుకో యాప్, ఆటలు ఆడేందుకో యాప్, రోజువారీ జమా ఖర్చులు రాసేందుకో యాప్... ఇలా గూగుల్ ప్లే స్టోర్‌లో లక్షలాది యాప్స్ ఉన్నాయి. సందర్భానికి, అవసరానికి తగ్గట్టు యాప్స్‌ను గూగుల్ అభివృద్ధి చేసింది. దీంతో ఆండ్రాయిడ్ ఓఎస్ ఉన్న ఫోన్లు కొనేందుకు యువత మక్కువచూపుతున్నారు. అంతేకాకుండా ప్లే స్టోర్ నుంచి ఉచిత డౌన్‌లోడ్ సౌకర్యం కూడా ఉండడంతో ఈ



సౌకర్యమున్న ఫోన్లపైనే అందరూ ఆసక్తి చూపుతున్నారు. అయితే.. యాపిల్, విండోస్, సింబయాస్ వంటి ఓఎస్‌లు కలిగిన ఫోన్లలో యాప్స్ ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు పెద్దగా లేదు. దీంతో ఆండ్రాయిడ్ ఫోన్లవైపు యువత మొగ్గుచూపుతున్నారు. గూగుల్ ప్లే స్టోర్‌లో ఉన్న 13 లక్షలకు పైగా ఉన్న యాప్స్‌లో 11లక్షల యాప్స్ మాత్రమే నాణ్యమైనవని గూగుల్ పేర్కొంది. అంతేకాకుండా ఆండ్రాయిడ్ ఓఎస్ అప్ గ్రేడ్ అయిన ప్రతిసారీ లక్షల కొద్దీ కొత్త యాప్స్ వచ్చి చేరిపోతుంటాయి. లక్షల సంఖ్యలో లభ్యమవుతున్న ఆండ్రాయిడ్ అప్లికేషన్‌లలో ఏది ఉపయోగకరమైనది..?, దేనివల్ల ఎంత ప్రయోజనం..? అనే అంశాల పట్ల ముందుగా వినియోగదార్లకు అవగాహన ఉండాలి. ఇటీవల కొత్తగా వచ్చిన రెండు యాప్స్ గురించి తెలుసుకుందాం...

తల్లి కాబోతున్న వారికి “అమ్మ”లాంటి యాప్

తల్లి కాబోతున్న వారికీ ఇప్పుడో యాప్ అందుబాటులోకి వచ్చింది. తల్లి కాబోతున్నవారు తమ ఆరోగ్యం గురించి ఎంతో జాగ్రత్తగా ఉండాలి. గతంలో ఎక్కువగా ఉమ్మడి కుటుంబాలు వుండేవి. తల్లుల సంరక్షణ, వారికి కావలసిన సూచనలను చెప్పడానికి పెద్దవారు అందుబాటులో ఉండేవారు. ఇప్పుడంతా అపార్ట్‌మెంట్ లైఫ్. ఇరుకు జీవితం. చాలా మంది తల్లులకు ఈ విధంగా సూచనలను ఇచ్చే వారు లేరు. ఈ లోటును కొంతైనా తీర్చడానికి అమ్మ (మదర్) అనే ఆండ్రాయిడ్ అప్లికేషను అందుబాటులోకి వచ్చింది. ఈ అప్లికేషన్ నేరుగా మొబైల్‌ఫోన్‌లో తల్లులు తీసుకోవలసిన జాగ్రత్తలను అలర్ట్ రూపంలో చూపిస్తుంది. అంతేకాకుండా, ఈ అమ్మ అప్లికేషనులో ప్రసవానికి ముందు, ప్రసవానంతరం తల్లీబిడ్డల సంరక్షణకు సంబంధించిన అనేక సూచనలను, జాగ్రత్తలను చదివి లేదా విని తెలుసుకొనే ఏర్పాటు చేయబడింది. ఆంగ్లం రానివారు తెలుగులోనూ ఈ అప్లికేషను ఉపయోగించుకోవచ్చు. అలాగే తెలుగు చదవలేనివారు కూడా వినడం ద్వారా తగు సూచనలు పొందవచ్చు. ఈ అప్లికేషన్‌ను సిడాక్ వారి వికాస్‌పిడియా సైటు నుండి ఉచితంగా మదర్.ఎపికే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ అప్లికేషన్‌ను ఉపయోగించుకోవాలంటే వినియోగదారులు తమ పేరు, వయస్సు, ఎత్తు, చివరి ఋతుక్రమ తేది వంటి వ్యక్తిగత సమాచారం అందులో ఫీడ్ చేయాల్సివుంటుంది. ఈ అప్లికేషను ఆండ్రాయిడ్ 4.0, ఆ తర్వాతి వెర్షన్‌లలో పనిచేస్తుంది. ‘మదర్’ అప్లికేషన్ చివరి ఋతుక్రమ తేదీ ఆధారంగా సాధారణ హెచ్చరికలను అందిస్తుంది. ఇది పద రూపంలో, శబ్ద రూపంలో, కాల పట్టికలోని తేదీ, సమయం ఆధారంగా సదరు వినియోగదారులను అప్రమత్తం చేస్తుంది. ఇది ఒక క్యాలెండర్‌ను ఉపయోగించి మునుపటి హెచ్చరికలను వినడానికి / చూడటానికి అనుమతిస్తుంది. డౌన్‌లోడ్ లింక్ : http://services.indg.in/ AppsDownload/ temobileapps. php#

పీసీలోనే ఫోన్ మెసేజ్‌లను చూడొచ్చు...

మనం కంప్యూటరులో పనిచేసుకుంటున్నపుడు ఏదైనా ఫోన్ లేదా మెసేజ్ మన ఫోన్‌కి వచ్చిందంటే మనం చేస్తున్న పనిని ఆపి ఫోన్ చూడవలసివస్తుంది. ఇది సాధారణంగా జరిగే ప్రక్రియ. అయితే, ఇప్పుడా అవసరం లేకుండానే మనకు వచ్చిన ఫోన్ లేదా మెసేజ్ వివరాలను నోటిఫికేషన్‌గా మన కంప్యూటరులోనే చూపించేందుకు ఆండ్రాయిడ్ యాప్ అందుబాటులోకి వచ్చింది. అదే పుష్‌బుల్లెట్. దీనిని ఉచితంగా గూగుల్ ప్లేస్టోర్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఇది ఐఫోనులో కూడా పనిచేస్తుంది. మొదట పుష్‌బుల్లెట్ యాప్‌ని మన ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకొని అకౌంట్ క్రియేట్ చేసుకోవాలి. ఆ తరువాత ఇక్కడ నుండి డెస్క్‌టాప్ క్లయింట్ లేదా వెబ్‌బ్రౌజర్ యాడ్‌ఆన్‌ని (క్రోమ్, ఫైర్‌ఫాక్స్) ఇన్‌స్టాల్ చేసుకొని మన పుష్‌బుల్లెట్ ఖాతా వివరాలు ఇచ్చి లాగిన్ కావాలి. ఉబుంటు వంటి లైనక్స్ ఆపరేటింగ్ సిస్టమ్ వాడేవారు కూడా ఇదే పద్ధతిలో పుష్‌బుల్లెట్‌ని ఇన్‌స్టాల్ చేసుకోవచ్చు. ఆ తర్వాతనుంచి మన ఫోన్ నోటిఫికేషన్‌లన్నీ మన డెస్క్‌టాప్ లేదా వెబ్‌బ్రౌజర్‌లో చూపించబడతాయి. ఈ పుష్‌బుల్లెట్ యాప్‌ని ఉపయోగించి మన ఫోను నోటిఫికేషన్లను డెస్క్‌టాప్‌లో పొందడమే కాకుండా వివిధ పరికరాలకు ఫైళ్లు, ఇమేజ్‌లు, వెబ్ లింక్‌లు, మెసేజ్‌లను పంపుకోవచ్చు. డౌన్‌లోడ్ లింక్ :https://play.google.com/store/apps/details?id= com. pushbullet.android

రచయిత సెల్ : 9490099219

అందుకున్నాం

■ **సమీక్షలు**



గిజుభాయి పగటికల
గుజరాత్ మూలం :
దివాస్వప్న
తెలుగు :ఎ .జి.యతిరాజులు
వెల : 40/-
పేజీలు : 112
ప్రతులకు :
ప్రజాశక్తి అన్ని బుక్‌హౌసులు

మతం మతమౌఢ్యం
మార్క్సిజం
సీతారాం ఏచూరి
వెల : 20/-
పేజీలు : 40
ప్రతులకు :
ప్రజాశక్తి అన్ని
బుక్‌హౌసులు





సంపెంగ పూదండ
శివ కౌముది దేవి
వెల : 75/-
పేజీలు : 136
ప్రతులకు :
ఎమ్.ఎస్.కౌముది,
సెల్ : 8072500518
ప్రజాశక్తి పుస్తక కేంద్రాలు

స్పెల్ మాస్టర్
ఇంగ్లీష్ స్పెల్లింగ్ మేడ్ ఈజీ
బొల్లిముంత
వెంకటరమణారావు
వెల : 60/-, పేజీలు : 56
ప్రతులకు : నవోదయ,
తెలుగు బుక్‌హౌసులు



గమనిక

➠ సమీక్షకోసం పుస్తకాలు పంపే రచయితలు, ప్రచురణ కర్తలు రెండు ప్రతులు పంపించాలి.

➠ రచయితలే సమీక్షలు రాయించి పంపకూడదు.

➠ పుస్తకాల మీద సమీక్షలకు సంబంధించి సంపాదకులదే తుది నిర్ణయం. ఈ అంశంపై ఉత్తర ప్రత్యుత్తరాలకు, ఫోన్లలో సంప్రదింపులకు తావు లేదు.

చిరునామా: సోపతి, ప్రజాశక్తి ఆదివారం సంచిక, ప్లాట్ నెం.21/1,
ఎం.హెచ్.భవన్, ఆజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా,
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500030.

ప్రజాపోరుకు ప్రతిబింబం



ధీర తెలంగాణ సాయుధ పోరాటబాట (వ్యాస సంకలనం)
పేజీలు : 95, వెల : రూ.60.
ప్రతులకు : విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు.

'బాంచన్ దొరా... నీ కాల్మొక్త...' జీవితం నుంచి స్వేచ్ఛ కోసం, దాస్య శృంఖలాల నుంచి విముక్తి కోసం జరిగిన జన సమరమే తెలంగాణ సాయుధ పోరాటం. బంధనాలు లేని మనిషిగా బతకే హక్కు కోసం, వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా, భూస్వాములు, జాగీర్దార్ల చెర నుంచి విడిపించుకోవడానికి జరిగిన ఈ పోరాటం భారత దేశ చరిత్రలోనే ఒక మహోజ్వల చైతన్య ఘట్టం. దాని గురించి ఎన్ని సార్లు చదివినా, మరెన్ని సార్లు విన్నా ఇంకా...ఇంకా.. చదవాలని, వినాలనిపిస్తుంది. ఇక ఆ పోరాటంలో పాల్గొన్న వారి ముఖతా వింటూంటే ఉత్తేజం ఉప్పొంగుతుంది. నాటి ఫ్యూడల్ ప్రతినిధుల అరాచకాల గురించి చదువుతూంటే గుండెలు కుతకుతలాడుతాయి. కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటైన సంఘం తరఫున వాటిని ఎదుర్కొన్న ప్రజల వీరోచిత గాథలు వింటూంటే రోమాలు నిక్కపొడుస్తాయి. అందులో పాల్గొనే అవకాశం నాకుంటేనా...!... కసుక్కున కత్తి దింపేవాడిని గదా!' అనిపిస్తుంది. ఆ వెంటనే 'అయ్యో అలాంటి అవకాశం కోల్పోయానే...!'అని బాధకలుగుతుంది.

4500 మంది ప్రాణత్యాగాలు, లెక్కలేనంత ఆస్తిపాస్తుల బలిదానాలు చేసి పది లక్షల ఎకరాల భూ పంపిణీ చేసిన ఇంతటి వీరోచిత పోరాటం ఇటీవల 'రాజకీయం'కావడం మనసులను ఎంతో కలిచి వేస్తుంది. తెలుగు ప్రజల సాహసాన్ని, త్యాగశీలతను, పోరాట పటిమను చాటి, నాటికీ నేటికీ కూడా ప్రపంచవ్యాప్తంగా ఎంతో మందికి స్ఫూర్తినిస్తున్న వీర తెలంగాణ విప్లవ పోరాటమది. నిజాం రాష్ట్రంలోని 16 జిల్లాలు, 6536 గ్రామాల్లోని ఆడామగా, పిల్లాజెల్లా, ముసలీముతకా తేడాలేకుండా కమ్యూనిస్టు జెండా చేతబట్టి కర్రలు, గుత్పలు, కారం పొడి వంటి ఆయుధాలతో దాడి చేసి శత్రువును దునమాడడం వల్లనే దాదాపు 225 సంవత్సరాల ఫ్యూడల్ నిజాముల పాలన 1948 సెప్టెంబర్ 17వ తేదీన అంతమైంది. అయితే మన రాజకీయ నేతలు తమ స్వార్థం కోసం ఈ రోజు విలీన దినమా? విముక్తి దినమా? విమోచన దినమా? విద్రోహ దినమా? అన్న వివాదాన్ని తెరమీదకు తెచ్చారు. భూస్వామ్య వ్యవస్థకు ముగింపు పలికి, భూకేంద్రీకరణను బద్ధలు చేసి, వెట్టి చాకిరీ నుంచి ప్రజలను విముక్తులను చేసిన హైదరాబాద్ సంస్థాన విమోచనోద్యమం నిస్సందేహంగా కమ్యూనిస్టుల త్యాగనిరతితో జరిగిన విముక్తి పోరే. ఈ వాస్తవాన్ని తెలియజెప్పడానికే... విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ 'ధీర తెలంగాణ సాయుధ పోరాటబాట' పుస్తకాన్ని ప్రచురించింది. అందుకే ఈ ప్రజా పోరాటం గురించి అన్ని కోణాల్లోనూ ఇందులో సమాచారం పొందు పరిచారు.

ఈ సంఘటిత ప్రజా పోరులో జనసమరంలో పాల్గొన్న వారూ, ఉద్యమంతో ప్రత్యక్ష, పరోక్ష సంబంధాలున్న వారే ఈ వ్యాసాలను రాశారు. మొదటగా ఈ పోరాట ప్రాముఖ్యత, నేటి దశలో దాని ప్రాధాన్యత తెలియజెప్పారు. దాని వెంటనే పోరాటం నేపథ్యాన్ని వివరించే భాగముంది. ఆ తరువాత నాటి ఉద్యమం సాగిన తీరు చెప్పారు. ఉద్యమంలో పాల్గొన్న వారి గురించీ, పోరు ఘట్టంలో ప్రధాన ప్రదేశాల గురించీ వర్ణించారు. అంతేకాదు ఆనాడు ఉద్యమానికి ఊపునిచ్చిన సాహిత్యం గురించీ రాశారు. ఇలా ఉద్యమ పూర్వాపరాలతో పాటు, ఉద్యమం సాగిన తీరు, దాని చుట్టూ అల్లుకుని తరువాతి కాలంలో జరిగిన పరిణామాలనూ ఈ పుస్తకం వివరిస్తుంది. స్థూలంగా ఉద్యమం గురించి అన్ని విషయాలూ చెబుతుంది. మన బూర్జువా రాజకీయ పార్టీలు, నేతల స్వార్థాన్ని ఎండగడుతూ ఇది ఫ్యూడల్, భూస్వామ్య, బూర్జువా పీడనల నుంచి విముక్తి కోసమే సాగిన పోరాటమని స్పష్టం చేస్తుంది. అందుకని ఈ పుస్తకం రాజకీయ పరిశీలకులు, సామాజికులే కాదు మానవ జాతి చరిత్రలోనే విశిష్టమైనదిగా, చిరస్థాయిగా నిలిచిపోయే సామన్యుడి విముక్తి సమరం గురించి తెలుసుకోవాలనుకునే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా చదవవలసిన పుస్తకంగా అందివచ్చింది.

- ఎన్. మదనయ్య

ప్రపంచీకరణ యుగంలో సంస్కృతి

ప్రపంచీకరణ-సంస్కృతి
సంకలనం: తెలకపల్లి రవి
పేజీలు: 128, వెల: రూ. 80
ప్రతులకు: ప్రజాశక్తి పుస్తక కేంద్రాలు

మానవుల జీవనవిధానం, మతం, ఆచార వ్యవహారాలు, సాహిత్యం, కళలను సంస్కృతిగా నిర్వచించవచ్చు. ఒక ప్రాంతాన్ని గానీ, ఒక జాతినిగాని సంస్కృతి పేరిట ఐక్యంగా వుంచాలని పాలకులు ప్రయత్నిస్తుంటారు. పాలకవర్గాల అవసరాల కోసమే ప్రతిదశలోనూ నిర్దిష్టమైన సాంస్కృతిక విలువలు పుట్టుకొస్తుంటాయి. అందుకే మెజారిటీ వర్గాల సంస్కృతిని పక్కనబెట్టి, మైనారిటీ వర్గాలకు సంబంధించిన పాలకవర్గాల సంస్కృతియే అందరి సంస్కృతిగా కీర్తింపబడుతుంది. ప్రజాజీవితంలో ప్రచారసాధనాలు, మీడియా ముందుకు తెచ్చిన సాంస్కృతిక పరివర్తనల మూలంగా 'ప్రజా సంస్కృతి' అనే పదం బహుళ ప్రచారంలోకి వచ్చింది. 'హిందూ సంస్కృతి' అన్నది కులాలవారీగా – ముస్లిం సంస్కృతి జాతులపరంగా, ప్రాంతాలపరంగా అనేక వైరుధ్యాలతో కూడుకునివుంది. బహుళ భాషలు, బహుళ జాతులున్న సమాజంలో ఒక్క సంస్కృతి ఎన్నటికీ వుండదు. అనేక సంస్కృతులు వుంటాయి. మరికొన్ని స్తబ్దుగా వుండిపోతాయి. సంస్కృతిని, నాగరికతను రక్షించాలనే పేరుతో మతం ఎప్పుడైతే రాజకీయాల్లోకి ప్రవేశిస్తుందో అప్పుడు మారణహోమం జరుగుతుంది. ఇస్లామిక్ సంస్కృతి ప్రక్షాళనం పేరిట సున్నీ ముస్లిం మతతత్వవాదులు ప్రపంచవ్యాప్తంగా జరుపుతున్న మారణకాండ చూస్తున్నదే. మతం, సంస్కృతి పేరిట రాజకీయ నాయకులు కూడబలుక్కోవడం సర్వసాధారణమైపోయింది.

అమెరికా ప్రోత్సహిస్తున్న సాంస్కృతిక సామ్రాజ్యవాదం మరింత ప్రమాదకరమైంది. ప్రజాచైతన్యాన్ని తనకు అనుగుణంగా మలచుకుని తన ఆధిపత్యాన్ని కొనసాగించే ఉద్దేశం దీనిలో వుంది. కనుకనే వినోదం పేరిట సమాచారాన్ని, మీడియాని ప్రజల అలవాట్లలో, అభిరుచుల్లో ప్రోది చేస్తూ, వారి మూలాలకు దూరం చేస్తోంది. ఈరకంగా ప్రపంచీకరణ మన సంస్కృతిని ప్రభావితం చేస్తున్న తీరును ఈ పుస్తకంలోని పలు వ్యాసాల్లో రచయితలు సవివరంగా విశ్లేషించారు.

అదే సమయాన సాంస్కృతిక సామ్రాజ్యవాదం అజేయమైందేమీ కాదనే విశ్వాసాన్ని వ్యాసకర్తలు అందిస్తారు. ఎక్కడయితే శ్రమ, సామాజిక వర్గాలూ, సామూహిక సాంస్కృతిక సంప్రదాయాలు కలిసి వుంటాయో అక్కడ సాంస్కృతిక సామ్రాజ్యవాదం వెనుదిరిగిపోతుందని వ్యాసకర్తలు వివరించారు. సామాజిక చైతన్యంతో కూడిన రాజకీయ శక్తుల్ని అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని కూడా నొక్కి చెప్పారు. దేశంలోని అధ్యయనశీలురైన ప్రముఖులు 'ప్రపంచీకరణ-సంస్కృతి'ని విశ్లేషిస్తూ రాసిన ఈ వ్యాసాల సంపుటి ఎంతో విలువైంది. సంస్కృతికి సంబంధించిన అవగాహనను విస్తృతపరుస్తుంది. ఈ సంకలనంలోని వ్యాసాలు మీడియా, సంస్కృతి, నాగరికత, సామాజిక ధోరణుల పలు పార్శ్వాల్ని తెలియజేస్తాయి.

– అశోక్‌కుమార్

స్టాక్ మార్కెట్ల వ్యూహం



స్టాక్ మార్కెట్ వ్యూయాలు, యుక్తులు,
రచన : డా. కె కిరణ్ కుమార్
పేజీలు 149, వెల రూ.100
ప్రతులకు వైభవ పబ్లికేషన్స్, విద్యానగర్,
ఫోన్ నెంబర్ 27090541

కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం భారీ ఆర్థిక సంస్కరణలకు తెరలేపడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు బిఎస్ఇ సెన్సెక్స్, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ నిఫ్టీలు వరుస ర్యాలీని కొనసాగిస్తున్నాయి. ఈ వార్తలు అన్ని పత్రికల్లో ప్రధానంగా కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మార్కెట్లలో పెట్టుబడులు పెట్టి భారీగా సంపాదించుకోవచ్చనే అభిప్రాయాలు పెరుగుతున్నాయి. కాని ఈ రంగంలో డబ్బు సంపాదించడం అంతా తేలిక ఏమి కాదు. అలాగని పెద్ద మొత్తంలో డబ్బు సంపాదించిన వారు లేకపోలేదు. ఈ క్రమంలో కొత్తగా స్టాక్ మార్కెట్లలో ప్రవేశించాలనుకునే మదుపర్లకు సులభంగా అర్థం చేసుకోవడానికి వీలుగా డాక్టర్ కె కిరణ్ కుమార్ రాసిన స్టాక్ మార్కెట్ వ్యూహాలు, యుక్తులు పుస్తకం మంచి అవగాహన కల్పిస్తుంది. స్టాక్ ఎక్స్ఛేంజీల్లో వ్యవహారాలు ఎలా జరుగుతాయిః షేర్లు ఎప్పుడు కొనాలి?, ఎలా కొనాలి? ఎవరి ద్వారా కొనవచ్చు? తదితర అంశాలను ఇందులో సమగ్రంగా వివరించారు. ఒక పద్ధతి ప్రకారం పెట్టుబడులు పెట్టి, ఓపికతో వ్యహరిస్తే లాభాలు సాధించుకోవచ్చు. మరోవైపు ఈ రంగంలో రాత్రికి రాత్రే కోటీశ్వరులు కావాలని పెట్టుబడులు పెట్టి బికారీలుగా మారిన వారు ఉన్నారు. బ్రోకర్లు చెప్పే మాయమాటలు, చేసే ఆకృత్యాలను ఇందులో సవివరంగా వివరించారు. ఎలాంటి వ్యక్తులు షేర్ మార్కెట్లో అడుగు పెట్టాలో విశ్లేషణాత్మకంగా అందించారు. చాలా మంది స్టాక్ మార్కెట్ల స్వభావం తెలియక అప్పులు చేసి మరి పెట్టుబడులు పెట్టి రోడ్డున పడిన వారు ఉన్నారు. ఈ పరిస్థితి ఉత్పన్నం కాకుడదంటే మిగులు డబ్బును మాత్రమే ఇందులో ఇన్వెస్ట్ చేయడం, ఆచీతూచి వ్యవహరించడం మంచిదని సూచించారు. షేర్ల కొనుగోలులో దీర్ఘకాల, స్వల్ప కాల వ్యూహాలను సూచించారు.

మంచి షేర్లను ఎన్నుకోవడం ఎలా?

కిరణ్‌కుమార్ రాసిన మరో పుస్తకం మంచి షేర్లను ఎన్నుకోవడం ఎలా? ఇందులో ఏ సమయంలో షేర్లు కొనుగోలు చేయాలి, ఎప్పుడు చేయాలనే అంశాలను పొందుపర్చారు. అదే విధంగా ఎలాంటి కంపెనీల షేర్లు కొనుగోలు చేయకూడదో వివరించారు. షేర్లను విక్రయించే సమయంలో తీసుకోవాల్సిన ఎత్తుగడలను అందించారు. అప్పుడప్పుడు కొన్ని కంపెనీల వ్యవహారాలపై పుకార్లు షికార్లు అవుతుంటాయి. కొన్ని కంపెనీలు తప్పుడు లెక్కలు అందించడమూ లాంటి అంశాల్లో మదుపర్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు.

స్టాక్ మార్కెట్లో మంచి షేర్లను ఎన్నుకోవడం ఎలా?, పేజీలు 115,
వెల రూ.100

– సిహెచ్ మధుకర్

■ ఈ వారం కవిత్వం

లోలోపలి విధ్వంసం

ఏదో ఒక పక్క నుంచి
కసుక్కున కత్తి దిగుతుంది
గాటు కనిపించదు
నెత్తురు చుక్కా రాలదు
ఒంట్లో నిస్సత్తువ ఆవరిస్తుంది
మనసు విరగకుండా
మనిషి ఎగరకుండా
సర్వస్వం నిర్వీర్యం చేసే
మర్మకళ విస్తరిస్తోంది

ఎవరికెవరు ఎదురుపడినా
ఒకర్నొకరు పలకరించుకోరు
తనివితీరా హత్తుకొని
ఎద బరువుని దించుకోలేరు
కాళ్లూ చేతులకు
సంకెళ్లు తగిలించుకొని
స్వీయ నిర్బంధంలోకి జారిపోతూ
ఉప్పూ, నిప్పూలా రగులుతుంటారు.

వేలాడే తాడు కనిపించదు
ఉన్నఫలంగా ఉచ్చు బిగుసుకుంటుంది
పక్కవాడ్ని తొక్కేసుకుంటూ
ఒక్కో మెట్టు ఎక్కేసుకుంటూ
కరెన్సీ శిఖరం మీంచి
శాసించాలని
భంగపడుతూ, లేస్తూ

రోజుకో అంగుళం మేర
దహించుకుపోతూ
రూపాయి మారకం క్రింద
నమ్మకం నలిగిపోతుంది.

ప్రకటనల ప్రవాహహోరులో
పడకటిల్లు సైతం తాకట్టుపడి
ఆలు మగల నడుమ
అగ్గి రాజుకుంటుంది

పరిమళాల జల్లుల్లో తడిసి
పరవశించాల్సిన దేహ పుష్పాలు
పెనవేసుకునే సమయానికి
పెనుగులాడుతూ విడివడుతాయి
వస్తు వ్యామోహం ముందు
విశ్వాసం అపహాస్యమవుతుంది.

పొరపాటున
ఏ పసిమస్తిష్కంలోనో
ఆలోచనా బీజం అంకురిస్తుంటే
కసిదీరా దాని ఇనుప పాదాలక్రింద
నలిపేసి,
వట్టిపోతున్న తరాన్ని
గుట్టుగా బహుకరిస్తుంది

మాయల ఫకీరు ప్రాణం
చిలుకలో ఉన్నట్టు
పరాయీకరణ పన్నాగంలో
మనిషి పంచప్రాణాల్ని
గుప్పిట్లో పట్టేసుకుని
వేయిన్నొక్క తలలతో
కాలకూటాన్ని చిమ్ముతున్న
గ్లోబల్ విన్యాసం...

ఇది మనిషికి మనిషిని
పరాయీకరించే ద్రోహకాలం
నిలువెల్లా కూలిపోతున్న
మనిషి లోలోపలి విధ్వంసం...

- కొండి మల్లారెడ్డి, 9441905525

ఆస్కార్ వైల్డ్ సూక్తులు

◆ మంచితనం మనతో మనం సమాధానాన్ని పొందడంలో వుంది. చెడ్డతనం ఇతర్లతో మంచితనంగా వుండాల్సిరావడంలో వుంది.
◆ కళాకారుడి నుంచి మనం ఆశించే ఒరిజినాలిటీ వస్తువులో ఉండకూడదు. నిర్వహణలో ఉండాలి.
◆ పాపులారిటీ అన్నది గొప్ప కిరీటం. అదెప్పుడూ హీనమయిన కళకే అందుతుంది.
◆ మనుషులు తమ అవగాహనను బట్టి మొదట దేవుణ్ణి తయారుచేస్తారు. తర్వాత ఆరాధిస్తారు.
◆ సృజన చేయలేని దానిని, సృజనకు మించిన అనంతమయిన కృషిని, జ్ఞాన విస్తృతిని విమర్శ కోరుతుంది.
◆ మనల్ని ఆకర్షించే లక్ష సంగతులు మన చుట్టూ వున్నాయి. వాటిని అదుపులో పెట్టాలంటే, వాటిని ఆమోదించాలంటే మనకు ఉత్సాహం, శక్తి కావాలి.
◆ అనుకరణ అనుకరణని సమతూకంలో వుంచుతుంది. అసమర్థత దాని సోదరుడుగా అంగీకరిస్తుంది.
◆ మనిషి సంతోషంగా వున్నాడంటే తనతో, తన పరిసరాలతో వైరుధ్యాల్లేకుండా అంగీకారంగా జీవిస్తున్నాడని అర్థం.

వేసుకునే దుస్తులంటే గుడ్డతోనే ఉండాలా? అని డౌటు వచ్చిన వారు కాస్త వెరైటీగా పూలతో కాగితాలతో డ్రెస్‌లను తయారు చేశారు. ఇప్పుడు అవి కూడా బోర్ కొట్టినట్లుంది. ఏకంగా కూరగాయలతోనే గౌన్లను తయారు చేశారు. ఇక్కడున్న గౌన్లన్నీ అలా చేసినవే. క్యాబేజీ ఆకులు, బ్రెడ్, టమాటా తొక్కలు, ఉల్లికాడలు, ర్యాడిష్, రెడ్ క్యాబేజీ, పుట్టగొడులు, ఐస్‌క్రీములతో కూడా ఫ్రాకులు తయారు చేశారు. అయితే ఇవి ఏదో రికార్డుల్లోకి ఎక్కడానికి తప్ప వేసుకోడానికి మాత్రం పనికిరావు.

ఈ చిత్రాలను చూస్తుంటే నిజంగానే అక్కడ పక్షులు వాలాయా అన్న భ్రమ కలుగుతోంది కదూ! చిన్న గాలికే అంత దూరం కొట్టుకుపోయే పక్షి ఈకలను ఎంత ఆకర్షణీయంగా మలిచాడో చూడండి క్రిస్ మేనార్డ్. ఇతను అమెరికా దేశస్థుడు. వీటిని తయారు చేయడానికి క్రిస్ జూలోని పక్షుల విభాగానికి వెళ్లి అక్కడ పడిఉన్న రంగురంగుల ఈకలను సేకరించి... మాగ్నిఫైయింగ్ గ్లాసెస్, ఫోర్‌సెప్స్, కంటి ఆపరేషన్లలో వాడే కత్తెర లాంటి సున్నితమైన పనితనానికి ఉపయోగించే పరికరాల సాయం తీసుకుంటాడు. కళాదృష్టి ఉండాలే కానీ ఎందుకూ పనికిరావనుకున్న వాటినుండి కూడా అందమైన ఆకృతులు తయారు చేయొచ్చు.